# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 79 | విశాఖపట్నం | 19-12-2025 శుక్రవారం | చీఫ్ ఎడిటర్ : శ్రీనివాస్ లెక్కల | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 79 | VISAKHAPATNAM | 19-12-2025 FRIDAY | CHIEF EDITOR: SRINIVAS LEKKALA | Pages:8 | Rate: Rs.5/-

Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram



రిపోర్టర్లు కావలెను

పతాకం న్యూస్ PATHAKAM NEWS TELEGU DAILY తెలుగు దినపత్రిక

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు శ్రీకాకుళం, పాడేరు, గోదావరి జిల్లాలు తో పాటు ఆంధ్రప్రదేశ్‌లో గల రాయలసీమ, జిల్లాలో జిల్లా రిపోర్టర్స్ కావలెను.
అనుభవం ఉన్న వారికి మొదట ప్రాధాన్యత ఇవ్వబడును.
ప్రతి వార్త ఉన్నది ఉన్నట్టుగా రాసి చూపిద్దాం రండి...

ఆఫీస్ ఇంఛార్జ్ : ఎల్.కృష్ణ రావు

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

9516171797, 9491286902


## మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ

# అతి పెద్ద స్కాం: జగన్



**అమరావతి, పతాకం న్యూస్:** చంద్రబాబు ప్రభుత్వంపై వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. 'కోటి సంతకాల ఉద్యమం' చారిత్రక విజయం సాధించిందని, ఇంత పెద్ద సంతకాల ఉద్యమం దేశ చరిత్రలోనే జరగలేదని అన్నారు. ముఖ్యంగా, మెడికల్ కాలేజీలను ప్రైవేటుకు కట్టబెట్టడం అతిపెద్ద స్కాం అని ఆయన ఆరోపించారు. పార్టీ ముఖ్య నేతలతో ఈరోజు సమావేశమైన ఆయన మాట్లాడుతూ... "ప్రైవేటుకు కాలేజీలు ఇచ్చి, మళ్లీ రూ.120 కోట్ల ప్రజాధనాన్ని జీతాల కింద ఎలా ఇస్తారు? ఇంతకంటే పెద్ద స్కాం ఉంటుందా?" అని ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. ఈ ఉద్యమంలో భాగంగా కోటి 4 లక్షల 11 వేల 136 మంది సంతకాలు చేశారని, ఇది ఒక చరిత్ర అని పేర్కొన్నారు. (తరువాయి 2వ పేజీలో)

## ఖర్చు పెట్టే ప్రతి పైసాకు

# ఫలితం ఉండాలి: చంద్రబాబు



**అమరావతి, పతాకం న్యూస్:** విద్యాశాఖ రూపొందించిన ముస్తాబు వంటి ఉత్తమ విధానాలను అన్ని జిల్లాల కలెక్టర్‌లు అనుసరించాలని సీఎం చంద్రబాబు దిశా నిర్దేశం చేశారు. అన్ని భూ రికార్డులు స్టోరేజ్ లేదా క్లౌడ్‌లో ఉంచటం ద్వారా అక్రమాలు అరికట్టవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. ఖర్చుపెట్టే ప్రతిపైసాకు చక్కని ఫలితం ఉండాలని పాలనాయంత్రాంగానికి సూచించారు. రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో కలెక్టర్లు అమలు చేస్తున్న కొన్ని విధానాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని ప్రశంసించారు. సచివాలయంలో జరుగుతున్న కలెక్టర్ల సదస్సు 2వ రోజూ సీఎం చంద్రబాబు నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారు. వివిధ జిల్లాల్లో అమలు చేస్తున్న ఉత్తమ విధానాలను ఆయా జిల్లాల కలెక్టర్లతోనే ప్రజెంటేషన్ ఇప్పించారు. 6 జిల్లాల కలెక్టర్లు ప్రదర్శించిన విధానాలు రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలని ఆదేశించారు. రొటీన్‌గా కాకుండా ప్రజలకు ఉపయోగపడేలా కలెక్టర్ల కాన్ఫరెన్సులో చర్చ జరగడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. వివిధ అంశాలపై అల్లూరి, పార్వతీపురం మన్యం, ఏలూరు, నెల్లూరు, కడప, అనంతపురం జిల్లాల కలెక్టర్లు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. జిల్లాల్లో అత్యుత్తమ విధానాల ద్వారా సేవలందిస్తున్న కలెక్టర్లను సీఎం అభినందించారు. వచ్చే కలెక్టర్ల సమావేశం నాటికి ప్రజలకు ఉపయోగపడే మరిన్ని వినూత్న ఆలోచనలు, కార్యక్రమాలతో రావాలని పిలుపునిచ్చారు. సాంకేతికత ద్వారా వినూత్న ఆలోచనలతో ప్రజలకు ప్రయోజనం కలిగించాలని దిశానిర్దేశం చేశారు. విద్యాశాఖలో ఈ మార్పు జరగాలని ఆకాంక్షించారు. కలెక్టర్లు మరింత మెరుగైన మోడళ్లతో కొత్త విధానాలు అమలు చేయాలని దిశానిర్దేశం చేశారు. ముస్తాబు కార్యక్రమాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా (తరువాయి 2వ పేజీలో)

## పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ అద్భుత ఫలితాలు: రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, పతాకం న్యూస్:** రాష్ట్రంలో మూడు విడతల్లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అద్భుత ఫలితాలు సాధించిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించిన ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ గెలుపునకు కష్టపడిన పార్టీ కార్యకర్తలకు ఆయన శుభాకాంక్షలు చెప్పారు. ఈ పంచాయతీ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించిన అధికారులకు అభినందనలు తెలిపారు సీఎం. గురువారం జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో పలువురు మంత్రులతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలో మొత్తం 12,702 పంచాయతీలకు గానూ 7,527 పంచాయతీల్లో కాంగ్రెస్ పార్టీ గెలిచిందన్నారు సీఎం. 808 కాంగ్రెస్ రెబల్స్ నెగ్గారని వివరించారు. దీంతో 66 శాతం ఫలితాలను కాంగ్రెస్ పార్టీ సాధించిందన్నారు. 3,511 బీఆర్ఎస్, 710 బీజేపీ మొత్తంగా 33 శాతం గెలిచాయని పేర్కొన్నారు. మా రెండేళ్ల పాలనకు ప్రజలు ఇచ్చిన తీర్పు ఈ ఫలితాలని ఆయన అభివర్ణించారు. కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో సైతం కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆశీర్వదించారన్నారు.

## బడి పిల్లలకు స్మార్ట్ కిచెన్‌ల ద్వారా

# వేడివేడి భోజనం: లోకేశ్



**అమరావతి, పతాకం న్యూస్:** పిల్లల ఆరోగ్యంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. పాఠశాల విద్యార్థు లకు నాణ్యమైన, రుచికరమైన ఆహారం అందించడమే లక్ష్యంగా ప్రణాళిక రచించింది. ఇకపై రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో 'స్మార్ట్ కిచెన్'ల ద్వారా వేడివేడి భోజనం అందనుంది. కడప జిల్లాలో ప్రయోగాత్మకంగా అమలు చేసి విజయవంతమైన ఈ విధానాన్ని, ఇప్పుడు రాష్ట్రమంతటా విస్తరించనున్నారు.

ఉండవల్లిలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన రెండో రోజు కొనసాగుతున్న కలెక్టర్ల సదస్సులో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రభుత్వ ప్రణాళికను వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలలకు ఇకపై స్మార్ట్ కిచెన్ల ద్వారానే ఆహారం అందించేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ఈ భారీ ప్రాజెక్టు కోసం జిల్లాల వారీగా కిచెన్ల నిర్మాణం చేపట్టాల్సి ఉందన్నారు. ఇందుకోసం అవసరమైన భూములను వెంటనే పరిశీలించాలని ఆదేశించారు.



5లో

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి తూట్లు!

# మోడీకి ఒమన్ అత్యున్నత పురస్కారం



**ఒమన్:** ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ తన ఖాతాలో మరో అరుదైన అంతర్జాతీయ గౌరవాన్ని చేర్చుకున్నారు. ఒమన్ పర్యటనలో ఉన్న ఆయనకు ఆ దేశ అత్యున్నత పురస్కారమైన 'ది ఫస్ట్ క్లాస్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ఒమన్'ను సుల్తాన్ హైథమ్ బిన్ తారిక్ గురువారం ప్రదానం చేశారు. గతంలో క్వీన్ ఎలిజబెత్, నెల్సన్ మండేలా వంటి ప్రపంచ ప్రఖ్యాత నేతలకు మాత్రమే ఈ పురస్కారం దక్కింది. రెండు రోజుల క్రితమే ఇథియోపియా అత్యున్నత పురస్కారాన్ని అందుకున్న మోదీకి ఇది 29వ అంతర్జాతీయ గౌరవం కావడం విశేషం. అంతకుముందు, ప్రధాని మోదీ, ఒమన్ సుల్తాన్ హైథమ్ మధ్య మస్కట్‌లోని అల్ బరకా ప్యాలెస్‌లో ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. ఇరు దేశాల మధ్య సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం కుదరడాన్ని ఇరువురు నేతలు ఒక కీలక మైలురాయిగా అభివర్ణించారు. రక్షణ, భద్రత, వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతికత వంటి పలు అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ పాల్గొన్నారు. భారత్, ఒమన్ మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి 70 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ప్రధాని మోదీ పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ పర్యటనతో ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం మరింత బలపడుతుందని నేతలు విశ్వాసం వ్యక్తం చేశారు.


పతాకం న్యూస్ APTEL/25/A2082 PATHAKAM NEWS TELEGU DAILY తెలుగు దినపత్రిక

ధర్మం కోసం పోరాటం చేస్తున్నా..
అవినీతి, అక్రమాలను బయటకు తీస్తున్నా..
పతాకం న్యూస్‌కు సహకరించగలరు

సంవత్సరం చందా రూ. 2000

PATHAKAM NEWS
State Bank of India
A/c No: 44576280686
IFSC:SBIN00021297
DUVVADA BRANCH

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

## సంపాదకీయం

# కార్పొరేట్ శక్తుల గుత్తాధిపత్యం

ఇటీవల కొన్ని రోజుల పాటు అత్యధిక విమాన సర్వీసులను రద్దు చేసి మొత్తం దేశ విమానయాన సర్వీసు నెట్‌వర్క్‌ను పూర్తిగా స్తంభింపచేసిన ఘటన ప్రైవేట్ కార్పొరేట్ సంస్థల క్రూరమైన నిజస్వరూపాన్ని చూపింది. గత మూడు దశాబ్దాలుగా భారత దేశంలో అమలు చేస్తున్న నయా ఉదారవాద విధానాల వికృత రూపం, అవి సృష్టించిన కార్పొరేట్ శక్తుల ఆర్థిక విధ్వంసం, ప్రజలపై సాగిస్తున్న విచ్చలవిడి దోపిడీ, ఈ సంస్థలకు-పాలక బూర్జువా పార్టీలకు మధ్య ఉన్న అక్రమ బంధం, అంతులేని అవినీతిని ఇండిగో దృష్టాంతం తెలియజేస్తున్నది. ఆర్థిక వ్యవస్థలో ముఖ్యమైన రంగాల్లో ప్రభుత్వ సంస్థలు బలంగా లేకపోతే ఏకస్వామ్యాలు ఎలా ఏర్పడతాయో, ప్రభుత్వ నియంత్రణ, జోక్యం లేని స్వేచ్ఛా మార్కెట్ అసలు నైజం ఎలా ఉంటుందో బట్టబయలైంది.

ఇండిగో సృష్టించిన అరాచకంపై కేంద్ర నరేంద్ర మోడీ ప్రభుత్వం ఏ చర్యా తీసుకోలేకపోయింది. పూర్తిగా ఇండిగోకు సాగిలపడింది. పైలట్‌లు, సిబ్బంది కోసం సవరించిన విమాన విధి సమయ పరిమితుల (ఎఫ్‌డిటిఎల్) నిబంధనలను ఆగమేఘాల మీద వచ్చే ఏడాది ఫిబ్రవరికి వాయిదా వేసింది. వాస్తవానికి వీటిని డిసెంబర్ నుండి అమలు చేయాల్సి వుంది. ప్రయాణికుల భద్రతను, ప్రాణాలను ఇండిగోకి ఫణంగా పెట్టింది. ప్రధాని మోడీ ఏకంగా నిబంధనలు వ్యవస్థలను మెరుగు పర్చాలిగాని, ప్రజలను ఇబ్బంది పెట్టకూడదని సిగ్గు లేకుండా డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ ( డిజిసిఎ ) నిబంధనలను తూర్పార పడుతూ ఇండిగో ను వెనకేసుకొచ్చారు. వాస్తవంగా విమాన పైలట్, ఇతర సిబ్బంది విరామం లేని పని గంటలు, ఒత్తిడి, ఇతర సమస్యలపై గత 15 ఏళ్ల నుండి పైలట్‌ల యూనియన్ పోరాడుతున్నది. 2011లో డిజిసిఎ నియమించిన ప్యానెల్ సిఫార్సులను డిజిసిఎ నూతన ఎఫ్‌డిటిఎల్, సిఎఆర్‌లను నోటిఫై చేసింది. వీటిని అమలు చేయనని ఇండిగో తెగేసి చెప్పింది. మోడీ అధికారంలోకి వచ్చిన తరువాత వీటి అమలుకు ప్రయత్నం చేయాల్సింది పోయి పూర్తిగా ప్రైవేట్ విమాన సంస్థల యాజమాన్యాలను కొమ్ముకాస్తూ వచ్చింది. యూనియన్ చివరికి సుప్రీంకోర్టును ఆశ్రయించాల్సి వచ్చింది. యూనియన్ కి అనుకూలంగా 2024 జనవరిలో కోర్టు తీర్పు ఇచ్చింది. 2025 నుండి దశలవారీగా డిసెంబర్ ఒకటి నుండి పూర్తిగా అమలుకు అన్ని సంస్థలు అంగీకరించాయి. కానీ మోడీ అండతో ఇండిగో ఏ ఒక్క దానిని అమలు చేయడానికి నిరాకరించింది. చివరికి విమాన సర్వీసులు అర్థంతరంగా నిలిపేసి అల్లకల్లోలం సృష్టించింది. ఈ ఏడాది జులైలో ప్రచురితమైన మీడియా నివేదిక ప్రకారం ఇండిగో దేశంలో అన్ని రోడ్లపై గుత్తాధిపత్యం సాధించింది. మొత్తం 1131 సర్వీస్ రోడ్లు దేశంలో ఉంటే 900 సర్వీస్ రూట్లలో అంటే 79.6 శాతం రూట్లలో విమాన సర్వీసులు నడుపుతున్నది. ప్రభుత్వ రంగం నుండి టాటా పరమైన ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్, ఎయిర్ ఇండియా రెండూ కలిపి 406 రూట్లలో విమానాలు నడుపుతున్నాయి. ఇండిగో నడుపుతున్న 900 రూట్లలో 514 రూట్లలో ఇండిగో తప్ప మరే ఇతర విమాన సంస్థ విమానాలు నడపటం లేదు. మొత్తం 737 రూట్లలో ఇండిగో లేదా టాటా రెండింటిలో ఒకే ఒక సంస్థ మాత్రమే విమానాలు నడుపుతున్నాయి. మిగిలిన రూట్లు ఎక్కువ భాగం ఈశాన్య రాష్ట్రాలు, చిన్న చిన్న నగరాలకు చెందిన రూట్లు. ఇవి లాభదాయకమైనవి కావు. ఎక్కువ విమాన సర్వీసులు కూడా ఉండవు. అందువల్ల ఈ రెండు సంస్థలు వాటికి విమాన సర్వీసులు నడపటం లేదు. మొత్తంగా దేశ విమానయాన రంగంలో ఇండిగో 65.6 శాతం, టాటా 25.7 శాతం వాటాతో మొత్తం ఈ రెండు సంస్థలే 91.3 శాతాన్ని ఆక్రమించాయి. బిజెపి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత ఇండిగో అమాంతంగా ఎదిగిపోయింది. ఇండిగో విస్తరించడానికి కావాల్సిన అన్ని రకాల మద్దతును నరేంద్ర మోడీ ప్రభుత్వం కల్పించింది. 2019 పార్లమెంట్ ఎన్నికల సమయంలో ఇండిగో యాజమాన్యం రూ.30 కోట్లకు పైగా ఎన్నికల బాండ్ల రూపంలో విరాళాలు ఇచ్చింది. ఇది బయటికి కనిపించే విరాళం. లోపాయికారిగా పెద్ద మొత్తంలో బిజెపి అగ్ర నాయకత్వం ఈ సంస్థ నుండి నిధులు పొందిందనేది మీడియా వెల్లడించింది. దీనికి ప్రతిఫలంగా ఇండిగో వేగంగా గుత్తాధిపత్యాన్ని సాధించేందుకు విమానయాన నూతన అవసరాల (సిఎఆర్) పేర అనేక నిబంధనలను సవరించి కొత్త నిబంధనలను బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చింది. వీటిని ఉపయోగించుకొని ఇండిగో తన విమానాలను రోజులో ఎక్కువ గంటలు గగనతలంలోనే ప్రయాణించేలా చేసింది.

# మీడియా అక్రిడిటేషన్ కమిటీ ఏర్పాటు




**అమరావతి, పతాకం న్యూస్:** రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టులకు అక్రిడిటేషన్స్ రూల్స్-2025ను అమలు చేసేందుకు ప్రభుత్వం స్టేట్ మీడియా అక్రిడిటేషన్ కమిటీ (ఎస్ఎంఎస్‌సి)ని నియమించింది. ఈ మేరకు జిఓ ఎంఎస్ నెంబరు 2410ని విడుదల చేసింది. మీడియా అక్రిడిటేషన్ రూల్స్ కమిటీ ఛైర్మన్‌గా ఐఅండ్‌పిఆర్ కమిషనరు/డైరెక్టర్, మెంబరు కన్వీనరుగా ఐఅండ్‌పిఆర్ కమిషనరు జాయింట్ డైరెక్టర్/అడిషనల్ డైరెక్టర్‌ను నియమించారు. మెంబర్లుగా గుర్తింపు పొందిన జర్నలిస్టు సంఘాల నుంచి ఒక్కో యూనియన్‌కు ఒక్కొక్కరు సభ్యులుగా ఉండాలని సూచించారు. ఇందులో ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఎపియుడబ్ల్యుజె,) ఎపి వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఎపిడబ్ల్యుజెఎఫ్), ఎపి మీడియా ఫెడరేషన్ (ఎపిఎంఎఫ్), ఎపి జర్నలిస్ట్ ఫోరమ్ (ఎపిజెఫ్)కు అవకాశం కల్పించారు. చిన్న, మధ్య తరహా పత్రికలకు సంబంధించి స్మాల్ అండ్ మీడియం డైలీ న్యూస్ పేపర్ అసోసియేషన్, స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (సామ్నా ఎపి), ఎపి ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ అసోసియేషన్ (ఎపిఇఎంజెఎ), ఆంధ్రప్రదేశ్ బ్రాడ్ కాస్ట్ జర్నలిస్ట్ అసోసియేషన్ (ఎపిబిజెఎ), ఆంధ్రప్రదేశ్ ఫొటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ (ఎపిపిజెఎ)కు ప్రభుత్వం అవకాశం కల్పించింది.

# తాడి గ్రామాన్ని సురక్షిత ప్రాంతానికి తరలించండి




**పరవాడ, పతాకం న్యూస్:** ఫార్మా కాలుష్యంలో తీవ్రంగా అల్లాడుతున్న తాడి గ్రామాన్ని సురక్షిత ప్రాంతానికి తరలించాలని సిఐటియు ఆధ్వర్యంలో తాడి గ్రామంలో గురువారం నిరసన కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ తాడి గ్రామంలో ప్రజలు కాలుష్య కోరల్లో చిక్కుకొని తీవ్రమైన జబ్బులతో అల్లాడుతున్నారని వెంటనే గ్రామాన్ని తరలించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని గనిశెట్టి డిమాండ్ చేశారు. భూగర్భ జలాలు నాశనం అయ్యాయని, పర్యావరణం దెబ్బతిన్నదని, మంచి గాలికి మంచినీరుకి, మంచి నేలకి ఈ ప్రాంత ప్రజలు నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గర్భాలు విచ్చమవుతున్నాయని, గాఢమైన వాయువులతో ప్రజలు గ్రామంలో ఉండలేని పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అనకాపల్లి జిల్లా పర్యటన సందర్భంగా తాడి గ్రామాన్ని తరలిస్తున్నట్లు స్పష్టమైన ప్రకటన చేయాలని గనిశెట్టి డిమాండ్ చేశారు. తాడి గ్రామ ప్రజలకు సురక్షమైన ప్రాంతాలకు గ్రామాన్ని తరలించడానికి జీవో విడుదల చేయాలని గనిశెట్టి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు నాగిరెడ్డి సత్యనారాయణ, సిఐటియు నాయకులు ఎస్ వెంకటలక్ష్మి, కుమారి, పార్వతి, లక్ష్మీ, నాయకత్వంలో ఆందోళన చేశారు ఈ సందర్భంగా తాడి గ్రామాన్ని తరలించాలని, కాలుష్యం నుండి ప్రజల ఆరోగ్యాలు కాపాడాలని, నినాదాలు చేశారు.

# అంగన్వాడీ టీచర్లకు సెల్ ఫోన్లు పంపిణీ



**పరవాడ, పతాకం న్యూస్:** పరవాడ మండలం, ఈ.బోనంగి బొద్దపువానిపాలెం గ్రామం అంగన్వాడీ కేంద్రంలో గురువారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కొత్తగా ప్రారంభించిన డిజిటల్ కార్యక్రమాలలో భాగంగా అంగన్వాడి సేవలను మరింత పారదర్శకంగా నిర్వహించేందుకు అంగన్వాడీ టీచర్లకు సెల్ ఫోన్లు పంపిణీ కార్యక్రమంలో జనసేన పార్టీ ఉమ్మడి విశాఖపట్నం రూరల్ జిల్లా అధ్యక్షులు, పెందుర్తి నియోజకవర్గం శాసనసభ సభ్యులు పంచకర్ల రమేష్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు గర్భిణీ స్త్రీలు పాలిచ్చే తల్లులు అందిస్తున్న సేవలు వివరములు సకాలంలో నమోదు చేసి ప్రభుత్వ పథకాలు అర్హులకు వేగంగా చేరేందుకు ఈ సెల్ ఫోన్ లు ఉపయోగపడతాయని తెలియజేశారు. పోషణ ఆరోగ్యం హాజరు వివరాలు నమోదు డిజిటల్ విధానంలో జరగడం ద్వారా సేవలో నాణ్యత మరింత మెరుగుపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ చైల్డ్ డెవలప్మెంట్ ఆఫీసర్ లలిత కుమారి, ఈ.బోనంగి గ్రామ సర్పంచ్ బొద్దపు శ్రీనివాసరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు బుగిడి రామ గోవిందరావు, రావాడ గ్రామ సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడు, పరవాడ గ్రామ సర్పంచ్ సిరపురపు అప్పలనాయుడు, పావని అంగన్వాడీ సూపర్వైజర్లు శ్యామల కుమారి, సంబంధిత అధికారులు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

# నెల్లూరు నూతన ఇంచార్జ్ మేయర్‌గా రూప్ కుమార్ యాదవ్



**అమరావతి, పతాకం న్యూస్:** నెల్లూరు నగర పాలక సంస్థ కార్యాలయం డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం సమావేశ మందిరంలో గురువారం కౌన్సిల్ అత్యవసర సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఇన్చార్జి మేయర్ రూప్ కుమార్ యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎక్స్ అఫీషియో సభ్యులు, రూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు. సమావేశంలో ఇన్చార్జి మేయర్ రూప్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ నెల్లూరు నగర పాలక సంస్థ మేయర్ గా ఉన్న పొట్లూరు స్రవంతి ఈనెల 14వ తేదీన వ్యక్తిగత కారణాల వల్ల పదవికి రాజీనామా చేసి పత్రాన్ని జిల్లా కలెక్టర్ వారికి తన ప్రతినిధుల ద్వారా అందజేశారని తెలిపారు. తదుపరి చేపట్టవలసిన చర్యలపై కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేసి తీర్మానం జరుపుకునేందుకు ఏర్పాటు చేయాలని సూచిస్తూ నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ కు జిల్లా కలెక్టర్ ఆదేశించారని వివరించారు. కావున నేడు ఏర్పాటు చేసిన అత్యవసర సర్వసభ్య సమావేశంలో పొట్లూరు స్రవంతి రాజీనామాను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించిందని రూప్ కుమార్ యాదవ్ స్పష్టం చేశారు. ఇంచార్జ్ మేయర్ గా బాధ్యతలు స్వీకరించిన రూప్ కుమార్ యాదవ్ ను ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, డిప్యూటీ మేయర్ తహసీన్ ఇంతియాజ్, కో ఆప్షన్ సభ్యులు, ప్రజా ప్రతినిధులు ఆత్మీయంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ నందన్, అన్ని విభాగాల ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

(మొదటిపేజీ తరువాయి)

# ఫలితం ఉండాలి: చంద్రబాబు

అన్ని స్కూళ్లకు స్మార్ట్ కిచెన్ల ద్వారా ఆహారం అందించేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు. స్మార్ట్ కిచెన్ల నిర్మాణం కోసం భూములను పరిశీలించాలన్నారు. కడపలోని స్మార్ట్ కిచెన్ విధానాన్ని కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్?కు చూపించామని ఆయనకు ఈ విధానం నచ్చిందని అన్నారు. కడప జిల్లాలో చేపట్టిన స్మార్ట్ కిచెన్ ఫర్ ఆల్ ద స్కూల్స్ ప్రాజెక్టును జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ వివరించారు. స్మార్ట్ కిచెన్ స్మార్ట్ హెల్త్ స్మార్ట్ చిల్డ్రన్ అన్నట్టుగా ఈ విధానాన్ని తీర్చిదిద్దాలని సీఎం చంద్రబాబు సూచించారు. అన్ని జిల్లాల కలెక్టర్లు కడప స్మార్ట్ కిచెన్లను సందర్శించాలని కోరారు. స్మార్ట్ కిచెన్‌కు సర్టిఫికేషన్ కూడా తీసుకోవటం అభినందనీయమని టీటీడీ తరహాలోనే తనిఖీ వ్యవస్థ ఉండాలని తెలిపారు. రైతు బజార్లలోనూ నాచురల్ ఫార్మింగ్ ఉత్పత్తులు రావాలని, సర్టిఫికేషన్‌తో పాటు డోర్ డెలివరీ వచ్చేలా ఉండాలన్నారు. స్మార్ట్ కిచెన్ల ద్వారా అంగన్ వాడీలు, సంక్షేమ హాస్టళు, రెసిడెన్షియల్ పాఠశాలలకూ ఆహారం అందించాలని సూచించారు. కడపలోని అన్ని స్కూళ్లల్లో చిన్నారులకు, విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పూర్తిస్థాయిలో ఈ బెస్ట్ ప్రాక్టీసెస్‌ను మరింతగా విస్తృతపరిస్తే ప్రజలకు ఉపయోగం కలుగుతుందని సీఎం అన్నారు. రిజిస్ట్రేషన్ శాఖలోనూ వినూత్న మార్పు వచ్చిందని 22ఏ భూముల విషయంలో ఏలూరు, బాపట్ల తదితర ప్రాంతాల్లో చేసిన మోడల్?ను ఇతర ప్రాంతాల్లోనూ చేయాలని ఆదేశించారు. రెవెన్యూ రికార్డుల డిజిటైజేషన్‌లో ఏఐ వినియోగం ప్రాజెక్టుపై అనంతపురం కలెక్టర్ ఆనంద్ ప్రజెంటేషన్ ఇచ్చారు. రెవెన్యూ ఆఫీస్ టూల్ తయారు చేసి యూజర్లకు అనువుగా మార్చామని వివరించారు. నాటుసారా తయారీ గ్రామాల్లో మార్పు: అనంత జిల్లాలో గ్రామస్థాయిలో రెవెన్యూ రికార్డుల లైబ్రరీ సిద్ధంగా ఉందని వెల్లడించారు. వివిధ అంశాలపై తనకు వచ్చిన ఫీడ్ బ్యాక్‌ను సీఎం కలెక్టర్ల కాన్ఫరెన్సులో పంచుకున్నారు. రిజిస్ట్రేషన్ల విధానం, నీటి భద్రత వంటి విషయాలు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నందుకు ఆనందంగా ఉందని తెలిపారు. 10 నిమిషాల్లో రిజిస్ట్రేషన్ పూర్తి చేసి తమను పంపించేశారని అదనంగా రూపాయి కూడా తీసుకోలేదని తనకు ఫోన్ వచ్చిందని సీఎం చెప్పారు. తిరుపతికి వెళ్తున్న మార్గంలో చెరువులన్నీ నీటి నిండిపోయాయని, తమకు చాలా సంతోషంగా ఉందని, ఎనర్జీ లెవల్స్ కూడా పెరిగాయన్నారు. ప్రాజెక్టు మార్పు అనే వినూత్న ఆలోచన ద్వారా 140 నాటుసారా తయారీ గ్రామాల్లో స్పష్టమైన మార్పు తీసుకురావడం పట్ల ఏలూరు జిల్లా కలెక్టర్‌ను సీఎం చంద్రబాబు అభినందించారు. కేవలం అరెస్టులు, కేసులతో వారి జీవితాల్లో మార్పు తీసుకురాలేమని ఇలాంటి కార్యక్రమాల ద్వారానే వారిలో మార్పు తీసుకురావచ్చని నిరూపించారన్నారు. ప్రాజెక్టు మార్పు కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని సూచించారు. డ్రగ్స్ నియంత్రణపై కూడా దృష్టి పెట్టాలని దిశా నిర్దేశం చేశారు. డ్రగ్స్ తీసుకునే వ్యక్తులను కూడా మార్చేలా ఉపాధి కల్పించాలని సీఎం ఆదేశించారు. శాఖలన్నీ ఇంటిగ్రేట్ చేసి రైతులకు ప్రయోజనకరంగా మార్చవచ్చనేది నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా నిరూపించారని సీఎం అభినందించారు. మానవ వనరులు సద్వినియోగం చేసుకునేలా ఛాంపియన్ ఫార్మర్ అనే వినూత్న ప్రయోగం బాగుందని ప్రశంసించారు. అమరావతిలోనే ఉండమని హిమాన్షును కోరానని కానీ ఓ జిల్లాలో ఇంపాక్ట్ కలిగిస్తానని కలెక్టరుగా వెళ్లి చక్కగా పని చేస్తున్నారన్నారు. రైతు సేవా కేంద్రం, స్వర్ణాంధ్ర విజన్ యూనిట్ల ద్వారా రైతులకు ప్రయోజనం కల్పించే ఇలాంటి విధానాలపై అన్ని జిల్లాల కలెక్టర్లు అవగాహన కల్పించాలని సూచించారు. చాంపియన్ ఫార్మర్ల ద్వారా స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేయడమో లేదా ఎంఎస్ఎంఈలుగా తీర్చిదిద్దడమో చేయాలన్నారు. సీజనల్ పంటలతో పాటు హార్టికల్చర్ పంటలకు ఈ విధానాలను విస్తరించాలని రైతులకు వ్యయం తగ్గాలని అత్యధిక ఆదాయం అందాలని సీఎం అన్నారు. స్వర్ణాంధ్ర-2047 10 సూత్రాలపైనా కలెక్టర్ల సదస్సులో చర్చ జరిగింది. జీరో పావర్టీ, పాపులేషన్ మేనేజ్‌మెంట్, నైపుణ్యం-ఉపాధి కల్పన, నీటి భద్రత, అగ్రిటెక్, లాజిస్టిక్స్, ఇంధన నిర్వహణ, ప్రొడెక్టు పర్ఫెక్షన్, స్వచ్ఛాంధ్ర, డీప్ టెక్ అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. పీ4 ద్వారా జీరో పావర్టీ లక్ష్యాన్ని సాధించటంతో పాటు ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టం ద్వారా ఫ్యామిలీ కార్డు జారీ, ప్రజారోగ్యం తదితర అంశాలపై ప్రజెంటేషన్‌లు ఇచ్చారు. రాష్ట్రంలో మాతాశిశు మరణాల రేటు తక్కువగా నమోదయ్యేలా కార్యాచరణ చేపట్టాలని సీఎం సూచించారు. ప్రజారోగ్యం కాపాడేలా పౌల్ట్రీ సహా ఇతర మాంసపు ఉత్పత్తుల్లో గ్రోత్ ప్రమోటర్లను నియంత్రించాలని ఆదేశించారు. రాష్ట్రంలో నీటి భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.

# అతి పెద్ద స్కాం: జగన్

ఉద్యమాన్ని విజయవంతం చేసిన గ్రామస్థాయి కార్యకర్త నుంచి ప్రతి ఒక్కరికీ ఆయన అభినందనలు తెలిపారు. చంద్రబాబు గ్రాఫ్ పడిపోతోందని స్వయంగా ఆయనే చెప్పుకున్నారని జగన్ వ్యాఖ్యానించారు. కూటమి పాలనలో రెండు బడ్జెట్‌లు ప్రవేశపెట్టినా ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. తమ హయాంలో అమలు చేసిన ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతు భరోసా వంటి పథకాలను రద్దు చేశారని ఆరోపించారు. ప్రైవేటీకరణ అంటే దోపిడీ అని, విద్య, వైద్యం ప్రభుత్వ ఆధీనంలోనే ఉండాలని జగన్ స్పష్టం చేశారు. తాము ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి బతికించామని, కానీ నేడు అన్ని వ్యవస్థలు తిరోగమనంలో ఉన్నాయని అన్నారు. చంద్రబాబు తన తప్పులను కప్పిపుచ్చుకోవడానికి కలెక్టర్లపైకి నెట్టేస్తున్నారని ఆరోపించారు.

# అబ్దుల్ కలాం సేవా సంఘం ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు



**అనకాపల్లి, పతాకం న్యూస్:** అనకాపల్లి పట్టణంలోని స్థానిక బిసి, బాలలు ఎస్సీ బాలలు బీసీ బాలికలు ప్రభుత్వ వసతి వసతిగృహాల్లో లో గురువారం అబ్దుల్ కలాం సేవా సంఘం వ్యవస్థాపక చైర్మన్ ఆళ్ళ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు జరిపారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్ మధుబాబు, బీసీ నాయకులు నటభూషణ్ శోభన్ బాబు, సేవాసమితి చైర్మన్ ముగడ అప్పారావు, హెచ్ డబ్ల్యు ఓ తబిత, అబ్దుల్ కలాం సేవా సంఘం సోషల్ మీడియా ఇంచార్జ్ ఆడారి పవన్, బృహస్పతి, అబ్దుల్ కలాం సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు. అబ్దుల్ కలాం సేవా సంఘం వ్యవస్థాపక చైర్మన్ ఆళ్ళ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ క్రిస్మస్ వేడుకలు ఏసుప్రభు పుట్టిన రోజు అని శాంతికి చిహ్నంగా ఏసుప్రభు జీవిత చరిత్ర బైబిల్ లో రాయబడ్డారని ఇది రోమన్ దేశస్తులు మతమని ప్రపంచ శాంతి దూతగా ఏసుప్రభు అవతరించాడని వాళ్ళు చెబుతూ ఉంటారని కనుక ప్రతి ఒక్కరు కూడా ఇందులో నేర్చుకోవాల్సింది శాంతి, ప్రేమని ప్రతి ఒక్కరికి అందించాలని ఈ బైబిల్ గ్రంథం చెబుతుందని అన్నారు. అన్ని మతాలను గౌరవించాలని స్వేచ్ఛ సమానత్వం ప్రతి ఒక్కరికి మన రాజ్యాంగంలో ఇవ్వబడిందని మన భారతదేశంలో పుట్టిన ప్రతి ఒక్కరూ అన్ని మతాలను గౌరవిస్తారని అన్నారు. మతం ఎప్పుడు సాటి వ్యక్తిని ప్రేమించాలి గౌరవించాలని చెబుతుందని అవి ప్రతి ఒక్కరు పాటించాలని అన్నారు. అబ్దుల్ కలాం సేవా సంఘం యువతలో చైతన్యం తెచ్చే కార్యక్రమాలు ఎన్నో చేస్తుందని రాజ్యాంగం పట్ల అలాగే నేటి యువత ఏ విధంగా ఉండాలి అన్న విషయాలపై చైతన్యం తీసుకొస్తూ ముందుకు వెళుతుందని ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తుందని యువత సేవను అలవర్చుకోవాలని అన్నారు.

## సింహాచలం టీడీఆర్‌లపై జీవీఎంసీ కమిషనర్ ఆరా



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** సింహాచలం బీఆర్‌టీఎస్ రోడ్డు విస్తరణలో స్థలాలు పోగొట్టుకున్న వారికి టీడీఆర్‌ల జారీలో అవినీతి జరిగిందని వస్తున్న ఆరోపణలపై జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ మంగళవారం ఆరా తీసినట్టు తెలిసింది. జనసేనకు చెందిన 22వ వార్డు కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ సైతం ఆధారాలతో సీఎం చంద్రబాబునాయుడు, విజిలెన్స్ డీజీపీ, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి, ప్రధాన కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. ఆస్తిపన్ను ఒకరి పేరిట ఉంటే టీడీఆర్ మరొకరికి ఇవ్వడం, తక్కువ విస్తీర?ం పోయిన వారికి ఎక్కువ విస్తీర్ణం పోయినట్టు అదనంగా టీడీఆర్ జారీచేయడం, తక్కువ ధర ఉన్నచోట ఎక్కువ ధర ఉన్న డోర్ నంబర్‌ను చూపించి అదనంగా టీడీఆర్ జారీ చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఇంకా టౌన్‌ప్లానింగ్ అధికారులు రోడ్డును ఆక్రమించే వ్యాపారులకు విధించే జరిమానా రశీదుల ఆధారంగా కొందరికి పరిహారం చెల్లించేందుకు సిద్ధమైనట్టు ప్రచారం జరుగుతోంది. దీనికి సంబంధించిన ఆధారాలతో మూర్తియాదవ్ ఫిర్యాదు చేయడంతో కమిషనర్ స్పందించారు. మంగళవారం మేయర్ పీలా శ్రీనివాసరావు ఛాంబర్‌కు వెళ్లి సింహాచలం బీఆర్‌టీఎస్ రోడ్డు విస్తరణ టీడీఆర్‌లపై చర్చించినట్టు తెలిసింది. టీడీఆర్‌ల జాబితాలో అనర్హులను చేర్చడంతోపాటు అక్రమాలు జరిగినట్టు తనకు కొందరు ఆధారాలను అందజేసినందున వాటిపై సమగ్ర అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందని కమిషనర్ అభిప్రాయపడినట్టు సమాచారం. అలాగే విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతోపాటు ఏసీబీ అధికారులు సైతం బీఆర్‌టీఎస్ రోడ్డు విస్తరణకు సంబంధించిన టీడీఆర్‌ల జాబితా గురించి ఆరా తీసినట్టు తెలిసింది. సీఎం కార్యాలయం నుంచి కొందరు అధికారులు సైతం ఫోన్ ద్వారా టీడీఆర్‌ల జారీలో ఆరోపణలపై ఆరా తీసినట్టు ప్రచారం జరుగుతోంది. టీడీఆర్‌లను అందజేస్తే ఏదైనా ఇబ్బంది ఎదురయ్యే అవకాశం ఉన్నందున అక్రమాలపై వస్తున్న ఆరోపణలు, ఆధారాలపై నిగ్గు తేల్చిన తర్వాతే ముందుకువెళ్లడం మంచిదని కమిషనర్ అభిప్రాయపడినట్టు కొందరు జీవీఎంసీ అధికారులు చెబుతున్నారు.

## అడపాను పరామర్శించిన రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ తాతయ్యబాబు



**బుచ్చయ్యపేట, పతాకం న్యూస్:** వడ్డాది గ్రామంలో జనసేన పార్టీ సీనియర్ నాయకులు అడపా నరసింహమూర్తి గురువారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, అనకాపల్లి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బత్తుల తాతయ్యబాబు పరామర్శించారు. నరసింహమూర్తి గత కొద్ది రోజుల క్రితం అనారోగ్య కారణంగా హాస్పటల్ కి వెళ్లి వైద్యం చికిత్స అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న తాతయ్యబాబు నర్సింహామూర్తి స్వగృహం కు వెళ్ళి ఆయనను పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనారోగ్యం నుంచి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. తాతయ్యబాబు తోపాటు పిఏసిఎస్ అధ్యక్షులు దొండా నరేష్, దొండా రమేష్ కూడా ఉన్నారు.

## చత్రపతి శివాజీ విగ్రహ ప్రతిష్టకు స్థలం ఖాయం

**కోటవురట్ల, పతాకం న్యూస్:** అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలంలో ఛత్రపతి శివాజీ విగ్రహానికి స్థలాన్ని ఖాయం చేయడం జరిగింది.అమావాస్య వెళ్ళాక పనులు ప్రారంభం చేయడం జరుగుతుంది,పెద్దలను కలవడం జరిగింది,ఇంకా కొంతమంది పెద్దలను కలవాలి, పెద్దలు కూడా మాకు సపోర్ట్ గా ఉన్నారు.ప్రతీ గ్రామ పెద్దలు కూడా ఈ కార్యక్రమానికి సపోర్ట్ చేస్తున్నారు.ఫిబ్రవరి 19 ఛత్రపతి శివాజీ పుట్టిన రోజు సందర్భంగా ఆ రోజే విగ్రహావిష్కరణకు కూడా ఏర్పాట్లు చేస్తున్నాము.ఆ సందర్భంగా గురువారం దత్తుడు బాబు ని కలవడం జరిగింది, ఈ కార్యక్రమంలో ఛత్రపతి శివాజీ హిందూ సేన అధ్యక్షులు నక్కా సత్యనారాయణ,సింగంపల్లి స్వామినాయుడు, మద్దు జోగిరాజు, గుడివాడ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనులకు రగ్గులు, పండ్లు పంపిణీ చేసిన సత్యసాయి సేవా సంస్థ





**దేవరాపల్లి, పతాకం న్యూస్:** దేవరాపల్లి మండలం గిరిజన గ్రామం వాలాబులో చలి తీవ్రతకు వణుకుతున్న గిరిజన కుటుంబాలకు వెచ్చదనాన్నిచ్చేందుకు,రగ్గులను పంపిణీ చేసి తమ ఉదారతను చాటుకుంది. అనకాపల్లి జిల్లా సత్యసాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో, హైదరాబాద్ సత్యసాయి సేవా సంస్థల సహకారంతో దేవరాపల్లి మండలంలోని పలు గిరిజన గ్రామాల్లో గత రెండు రోజులుగా ఈ సేవా కార్యక్రమాలు జరిగాయి.మంగళవారం గర్శింగి పంచాయతీ పరిధిలోని రేగులబంద, సంతపాలెం, యాలంబయలు, తాటిపూడి, చింతలపాలెం, కించుమండ గ్రామాల్లోని గిరిజనులకు రగ్గులు అందజేశారు. బుధవారం వాలాబు పంచాయతీ పరిధిలోని నగరంపాలెం, బోడగుమ్మి, బోర్రచింతల తదితర గ్రామాల్లో పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. చలి నుంచి రక్షణ కల్పించే రగ్గులతో పాటు, పండ్లను కూడా పంపిణీ చేశారు.సత్యసాయి సేవా సంస్థల ప్రతినిధులు శశిభూషణరావు, హితీష్ వెంకట సాయి వ్యక్తిగతంగా రగ్గులను సమకూర్చగా, అనకాపల్లి జిల్లా సంస్థ సభ్యులు క్షేత్రస్థాయిలో గిరిజనుల వద్దకు చేర్చారు. ఈ పంపిణీ కార్యక్రమంలో సత్య సాయి భక్తులు ఆదిరెడ్డి కన్నబాబు మాస్టర్,పెంటారావు తదితరులు పాల్గొన్నారు.

## డ్రోన్ కెమెరాతో నేర నియంత్రణ చర్యలు: కోటపాడు ఎస్సై ధనుంజయ్



**కోటపాడు, పతాకం న్యూస్:** అనకాపల్లి జిల్లా కోటపాడు మండలం పరిధిలో ప్రజల భద్రతను మరింత బలోపేతం చేయడం కోసం , నేరాలను ముందస్తుగా నివారించడ మే లక్ష్యంగా స్థానిక పోలీస్ యంత్రాంగం డ్రోన్ కెమెరాల సహాయంతో ప్రత్యేక నేర నియంత్రణ చర్యలు చేపడుతున్నారు. గ్రామాలు, కాలనీలు, రహదారులు, జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాలు, సమస్యాత్మక ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాల ద్వారా పర్యవేక్షణ నిర్వహిస్తున్నామని ఎస్సై ధనుంజయ్ తెలిపారు . ఈ డ్రోన్ నిఘా ద్వారా అనుమానాస్పద కదలికలను గుర్తించి, చట్టవిరుద్ధ కార్యకలాపాలను అరికట్టేందుకు తక్షణ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు .ప్రత్యేకంగా రాత్రి వేళల్లో చోరీలు, అసాంఘిక కార్యకలాపాలు, మద్యం సేవించి వాహనాలు నడపడం, గుంపులుగా తిరగడం,గంజాయి అక్రమ రవాణా , వంటి ఘటనలను నియంత్రించేందుకు డ్రోన్ టెక్నాలజీ ఎంతో ఉపయోగపడుతోందని అన్నారు . డ్రోన్ కెమెరాల ద్వారా సేకరించిన సమాచారం ఆధారంగా బీట్ సిబ్బంది, గస్తీ వాహనాలకు తక్షణ సూచనలు అందిస్తూ సమర్థవంతమైన పోలీసింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు .ప్రజలు పోలీస్ శాఖకు సహకరించి, ఏవైనా అనుమానాస్పద కార్యకలాపాలు గమనించినట్లయితే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని డ్రోన్ కెమెరాతో నేర నియంత్రణ చర్యలు, ప్రజల భద్రతను మరింత బలోపేతం చేయడం కోసం , నేరాలను ముందస్తుగా నివారించడమే లక్ష్యంగా స్థానిక పోలీస్ యంత్రాంగం డ్రోన్ కెమెరాల సహాయంతో ప్రత్యేక నేర నియంత్రణ చర్యలు చేపడుతున్నారు. గ్రామాలు, కాలనీలు, రహదారులు, జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాలు, సమస్యాత్మక ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాల ద్వారా పర్యవేక్షణ నిర్వహిస్తున్నామని ఎస్సై ధనుంజయ్ అన్నారు

## రెవెన్యూ రికార్డుల్లో లేని భూములకు పాస్ బుక్కులు

- గతంలో రెవెన్యూ అధికారులు చేసిన తప్పిదాలను సరి చేయాలి
- కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూములు కాపాడండి
- 2017లో హై కోర్టు ఇచ్చిన ఇంట్ ర్మ్ ఆర్డర్ తాత్కాలిక మైనది దీనిపై రెవెన్యూ అధికారులు లీగల్ ఒపినియన్ తీసుకోవాలి
- సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు వెంకన్న డిమాండ్



**దేవరాపల్లి, పతాకం న్యూస్:** దేవరాపల్లి రెవెన్యూ సర్వే నెంబరు 280/1-280/2- 2801/1- 281/2 లో గల ప్రభుత్వ భూములు వెంటనే స్వాదినం చేసు కోవాలి రెవెన్యూ రికార్డుల్లో లేని భూములకు పాస్ బుక్కులు ఇచ్చిన వాటిని సరి చేయాలని 2017, ఫలసాయం తీసు కోవ దానికి కోర్టు ఇచ్చిన తాత్కాలిక ఇంట్ ర్మ్ ఆర్డర్ పై లీగల్ ఒపిన్ తీసుకోని వెంటనే చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు డి.వెంకన్న డిమాండ్ చేసారు. గురువారం అయిన వీలేకర్ల సమావేశంలో మాట్లాడారు, మండలం దేవరాపల్లి రెవెన్యూ సర్వే నెంబర్లు 280/1- 280/2 - 281/1-281/2 లో గల భూములు అన్ని (SFA) మరియు ప్రభుత్వ రెవెన్యూ రికార్డులు ప్రకారం ప్రభుత్వ భూములుగా నమోదు అయ్యి ఉన్నాయని వీటిని ఇతర ప్రాంతాలకు చేందిన కోంత మంది రెవెన్యూ రికార్డుల్లో ఉన్న 281/2 గల భూమి సుమారుగా 6-88 ఎకారాలను 281/2ఏ అని తప్పుడు రికార్డులు స్రుష్టించి అన్యాక్రాంతం చేసి పామ్ ఆయిల్ తోటలు వేసె సారని తెలిపారు దీంతో పాటు సర్వే నెంబరు 280/1,లో 3-63 ఎకారాలు భూమిని క్షేత్రియ దేవి సింగ్ అను వ్యక్తికి అసైన్డ్ చేయగా అ భూమిని కూడా అన్యాక్రాంతం చేసి పామ్ ఆయిల్ తోటలు వేసెసారని అన్నారు దింతో పాటు 281/1 గల భూములు కూడా ప్రభుత్వ భూములు అయ్యి ఉన్నవని తెలిపారు విటి అన్నింటిని అక్ర మించుకోని సాగు చేసు కుంటున్నారని తెలిపారు,గతంలో అనేక సార్లు పిర్యాదులు చేసిన సందర్భంగా, తేదీ 5/2/2013 లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దర్యాప్తులో ఈ భూములు అన్ని ప్రభుత్వ భూములు అని నిగ్గు తెల్చి ప్రభుత్వ స్వాధీనంలో ఉంచారని అన్నారు దింతో ఈ భూములు ఆక్రమించిన యాజమాని చోడవరం మున్సిపల్ సివిల్ జడ్జి కోర్టును అశ్ర మించగా దీనికి నాటి రెవిన్యూ అదికారులు కౌంటర్ పిటిషన్ వేసారని తెలిపారు కోర్టును అశ్రమించిన వ్యక్తి కోర్టుకు సక్రమంగా హాజరు కానందున తేదీ,4/12/2017 కేసు కోట్టి వేయడం జరిగిందని తెలిపారు, దింతో తను మరలా గౌరవ హై కోర్టును ఆశ్ర మించడం జరిగిందన్నారు నాటి నుండి ఈ భూములు అన్ని ప్రభుత్వ, రెవెన్యూ అధికారులు స్వాధీనంలో విఆర్వో పర్య వేక్షణలో ఉన్నాయని తెలిపారు అయిన్నపటికి అక్రమణ దారుడు అయిల్ పామ్ పంటను కటింగ్ చేయగా తేదీ14/10/2012 న రెవెన్యూ అధికారులు,స్వాధీనం చేసుకుని వేలం పాట వేసి వచ్చిన డబ్బులను ప్రభుత్వ ఖజానాకు జమ చేసారని తెలిపారు,దింతో ఆక్రమణ దారుడు 2017 గౌరవ హై కోర్టులో తాత్కాలిక ఫలసాయం తీసు కోవడానికి 7-84 సేంట్లుకు ఇంట్ ర్మ్ ఆర్డర్ తెచ్చు కున్నారని తెలిపారు. వాస్త వానికి అక్రమదారునికి 6-88 సేంట్లుకు మాత్రమే పాస్ బుక్కులు ఇచ్చారని అటు వంటి అప్పుడు 7-84 సేంట్లు కోర్టు అర్డర్ ఎలా ఇస్తుందని ప్రశ్నించారు దీనిపై కూడా లీగల్ ఒపీనియన్ తీసు కోవాలని కోరారు ప్రస్తుతం రెవెన్యూ అధికారులు పర్య వేక్షణ లోపం వల్లను,భూ ఆక్రమణ దారుడు ఎ దెచ్చగా ఫామ్ అయిల్ పంటలను ప్రతి నేలకు రెండు సార్లు కటింగ్ చేసి తీసుకుపోతున్నారని తెలిపారు దింతో పాటు నూతనంగా గెస్ట్ హౌస్ నిర్మాణం కూడా జరుగుతుందని ఇంత జరుగుతున్న ఈ భూములు కోర్టు వివావాదంలో ఉన్న ప్రభుత్వ భూములు రెవెన్యూ అధికారులు రక్షించక పోవడం అన్యాయా మన్నారు, అదికారులు వెంటనే జోక్యం చేసుకుని ప్రభుత్వ భూములకు,భూముల్లో ఉన్న అన్ని రకాలు పంటలకు వెంటనే రక్షణ కల్పించి గెస్ట్ హౌస్ నిర్మాణాన్ని వెంటనే నిలుపుదల చేయాలని కోరారు,

## సీయోను ప్రార్ధన మందిరంలో క్రిస్మస్ వేడుకలు



**మాడుగుల, పతాకం న్యూస్:** మాడుగుల నియోజకవర్గం,దేవరాపల్లి మండలం,బోయిలకింతాడ గ్రామంలో ఉన్న సీయోను ప్రార్ధన మందిరంలో దేవరాపల్లి మండల పరిషత్ కోఫ్షన్ మెంబర్ దండే జాన్ విక్టర్ ఏర్పాటు చేసిన ముందస్తు క్రిష్టమస్ వేడుకలకు ముఖ్య అతిధులుగా విశాఖపట్నం ప్రాంతం నుండి బిషప్ రెవరెండ్ డాక్టర్ పి.విజయ్ కుమార్,దేవరాపల్లి మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మరియు గ్రామ సర్పంచ్ బూరె బాబురావు విచ్చేసి క్రిస్టమస్ వేడుకల కేక్ కట్ చేసి అక్కడకు విచ్చేసిన సంఘ విశ్వాసకులకు, గ్రామ ప్రజలకు క్రిస్టమస్ శుభాకాంక్షలు తెలియజేస్తూ అనంతరం వారు మాట్లాడుతూ లోక సమస్త ప్రజలను,అన్ని జీవరాశులను ఆయురారోగ్యాలతో ఆ ఏసుక్రీస్తు కృపతో కాపాడాలి అని అన్నారు అనంతరం విశ్వాసకులకు వారు ఏర్పాటు చేసిన చీరలును పంపిణీ చేయడం జరిగింది ఈ యొక్క కార్యక్రమం లో జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం ప్రధాన కార్యదర్శి బొబ్బిలి రాము, రెవరెండ్ పాస్టర్ డేవిడ్ లివింగ్ స్టన్ ,రెవరెండ్ పాస్టర్ ఎస్.రవికుమార్,రెవరెండ్ పాస్టర్ యబ్బేజు , రెవరెండ్ పాస్టర్ ఎస్.సుధాకర్ ,రెవరెండ్ పాస్టర్ జి.ప్రసాద్,పాస్టర్ పి. జ్యోతిమ్మ ,పాస్టర్ ఎన్.మణెమ్మ ,సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఎఫ్డీఐ పెంపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

**చోడవరం, పతాకం న్యూస్ :** బీమా రంగంలో ఎఫ్డీఐ పరిమితిని 74 శాతం నుండి 100 శాతంకు పెంచాలనే కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఎల్ఐసీ విశాఖపట్నం డివిజనల్ కార్యా లయం వద్ద గురువారం నిరసన చేపట్టారు.ఐసీఈయూ ప్రధాన కార్యదర్శి జి.వరప్రసాద్ మాట్లాడుతూ.. శత శాతం ఎఫ్డీఐ అమలులోకి వస్తే ప్రజల పొదుపు విదేశీ మూలధనానికి ముప్పు అని హెచ్చరించారు. భారతీయ భీమా సంస్థలను విదేశీ కంపెనీలు స్వాధీనం చేసుకునే ప్రమాదం ఉందన్నారు.దేశ ఆర్థిక వ్యవస్థకు ముప్పు అన్నారు. పాలసీదారుల సంక్షేమం దృష్ట్యా ఎఫ్డీఐ పరిమితిని కంచరాదు అన్నారు.లోక్ సభలో ఈ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసారు.

## ఏసీబీ వలలో సర్వేయర్



**పుంగనూరు, పతాకం న్యూస్:** భూమికి సర్వే చేసిన రిపోర్టు ఇచ్చేందుకు లంచం తీసుకుంటున్న సచివాలయ సర్వేయర్‌ను ఏసీబీ అదుపులోకి తీసుకుంది. ఏఎస్పీ విమలకుమారి కథనం మేరకు... పుంగనూరుకు చెందిన బీజేపీ నాయకుడు, నాయిబ్రాహ్మణ సంఘ నేత ఉమాశంకర్, అతడి స్నేహితుడు షఫీ మంగళం గ్రామం కొత్తచెరువు వద్ద అదే గ్రామానికి చెందిన రెడ్డెప్ప వద్ద ఆరు నెలల క్రితం 8 కుంటల స్థలాన్ని కొనుగోలు చేసి అడ్వాన్సుగా రూ.4లక్షలు చెల్లించి సేల్ అగ్రిమెంట్ చేసుకున్నారు. అన్నమయ్య జిల్లా మొలకలచెరువు ప్రాంతానికి చెందిన శ్రీరాములు మంగళం సచివాలయంలో సర్వేయర్‌గా పనిచేస్తున్నారు. స్థలాన్ని సర్వే చేసి ఇవ్వాలని శ్రీరాములును కోరగా తనకు రూ.50 వేలిస్తే పాసుపుస్తకం చేసి ఇస్తానని చెప్పారు. చివరకు రూ.35 వేలకు ఒప్పందం చేసుకోవడంతో ఈనెల 10వ తేది భూమిని సర్వే చేశారు. ఈలోపు ఉమాశంకర్ తిరుపతిలో ఏసీబీ అధికారులను కలిసి ఈ విషయాన్ని తెలియజేయడంతో వారు సర్వేయర్‌ను పట్టుకోవడానికి వలపన్నారు. పుంగనూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉమాశంకర్ వద్ద శ్రీరాములు రూ.20 వేలు తీసుకుంటుండగా ఏసీబీ ఏఎస్పీ విమలకుమారి, డీఎస్పీ సోమన్న రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. సర్వేయర్ శ్రీరాములును అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచనున్నట్లు విమలకుమారి తెలిపారు. ఏసీబీ దాడుల్లో సీఐలు వీవీ.రమణ, నరసింహారావు, విద్యాసాగర్, మల్లిఖార్జున తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏఎస్పీ విమలకుమారి మాట్లాడుతూ అవినీతి వ్యవహారాలేవైనా ప్రజల దృష్టికి వస్తే తమకు ఫిర్యాదు చేయాలని కోరారు. తిరుపతి రేంజ్ పరిధిలో తనకు 9440446190, టోల్‌ఫ్రీ నెంబరు 1064కు ఫోన్ చేసి సమాచారం ఇస్తే అవినీతి అధికారులను పట్టుకుంటామని వివరించారు.

## అంకితభావంతో విధులు నిర్వహించాలి



**ఎచ్చెర్ల, పతాకం న్యూస్:** అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వహించాలని ఆర్జీయూకేటీ చాన్సలర్ ప్రొఫెసర్ కె.మధుమూర్తి అన్నారు. ఆర్జీయూకేటీ శ్రీకాకుళం క్యాంపస్ ను సందర్శించిన ఆయన సిబ్బందితో సమావేశం నిర్వహించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులే ఈ క్యాంపస్‌లో ఎక్కువగా ఉన్న నేపథ్యం లో వారికి సాంకేతిక విద్యను పూర్తిగా అందేలా చర్యలు తీసుకో వాలన్నారు. విద్యార్థులతో స్నేహ పూర్వక వాతావరణంలో మెలగాలన్నారు. అసంపూర్తిగా ఉన్న భవనాలను పరిశీలించారు. కార్యక్ర మంలో క్యాంపస్ డైరెక్టర్ కేవీజీడీ బాలాజీ, ఏవో ముని రామకృష్ణ, డీన్ శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## 'ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల'లో జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు ఘనంగా ప్రారంభం




**అరకులోయ, పతాకం న్యూస్:** స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఫిజిక్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో డిసెంబర్ 18, 2025న "జాతీయ ఇంధన పొ దుపు వారోత్సవాలు–2025"ను మహోజ్వలంగా నిర్వహిం చారు. డిసెంబర్ 14 నుంచి 27 వరకు సాగే ఈ వారోత్సవాలు "విద్యుత్ పొదుపుని తీర్చిదిద్దుదాం.. ఇంధనం పొదుపు చేద్దాం.. భావితరాలకు వెలుగునిద్దాం" అనే నినాదాలతో ఘనంగా కొనసాగుతున్నాయి. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కళాశాల ప్రిన్సిపల్ శ్రీ పట్టాసి చలపతిరావు మాట్లాడుతూ, ఎల్ ఈ డి లైటింగ్, శక్తి సమర్థవంతమైన ఉపకరణాలు, స్మార్ట్ టైమర్లు వినియోగించడం, వేడి నీటి వినియోగాన్ని తగ్గించడం ద్వారా విద్యుత్ బిల్లులు, పర్యావరణ కాలుష్యం తగ్గుతాయని తెలిపారు. అనవసర లైట్లు, ఉపకరణాలు ఆపివేయడం ద్వారా విద్యుత్‌ను ఆదా చేయవచ్చని సూచించారు. డిప్యూటీ డైరెక్టర్ సి.హెచ్. మోహన్, ఏ.ఈ ముఖేష్, సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్ ఎన్. ఆనంద్, లైన్ ఇన్‌స్పెక్టర్ సి.హెచ్. లక్ష్మయ్యలు మాట్లాడుతూ, లైటింగ్ మెరుగుదల, ఉపకరణాల సామర్థ్యం, తాపన–శీతలీకరణ, రోజువారీ అలవాట్లు, నిర్మాణాత్మక నవీకరణల ద్వారా తక్కువ శక్తి వినియోగంతో ఇంధన పొదుపు సాధ్యమని వివరించారు. ఫిజిక్స్ అధ్యాపకుడు కే. అఖిల్ తేజ మాట్లాడుతూ, సాంప్రదాయ బల్బులను ఎల్‌ఈడి లైట్లతో భర్తీ చేయాలని, ఇవి 80 శాతం వరకు శక్తిని ఆదా చేస్తాయని, ఎక్కువ కాలం పాటు ఉంటాయని తెలిపారు. పగటి సమయంలో సహజ కాంతిని ఉపయోగించుకోవడం, గది నుంచి బయటకు వెళ్లేటప్పుడు లైట్లు ఆపివేయడం వంటి చిన్న అలవాట్లు పెద్ద మార్పు తెస్తాయని సూచించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఎస్సే రైటింగ్, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపల్ కే శశి కుమార్, డాక్టర్ సి.హెచ్. మురళీకృష్ణ, కెమిస్ట్రీ అధ్యాపకుడు పి. శోభన్, కంప్యూటర్ సైన్స్ అధ్యాపకురాలు బి. సరస్వతి, ఇతర అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# విమ్స్‌లో కాక్లియర్ ఇంప్లాంట్ శస్త్ర చికిత్సలు




**విశాఖపట్నం, పతాకం న్యూస్:** పుట్టుకతోనే వినికిడి సమస్య కలిగిన చిన్నారుల జీవితాల్లో వెలుగులు నింపే కాక్లియర్ ఇంప్లాంట్ శస్త్ర చికిత్సలను విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్)లో కూడా నిర్వహిస్తున్నారు. ఒకప్పుడు ఈ శస్త్ర చికిత్సలను ఈఎన్‌టీ, గాయత్రీ ఆస్పత్రుల్లో మాత్రమే చేసేవారు. అయితే, గడిచిన నాలుగేళ్లుగా ఈ విమ్స్‌లోనూ నిర్వహిస్తున్నారు. అయితే, ప్రజలకు సమచారం లేకపోవడంతో ఇక్కడ అందుతున్న సేవలను సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు. విమ్స్‌లో 2021 నుంచి ఇప్పటివరకూ 21 మంది చిన్నారులకు విజయవంతంగా ఆపరేషన్ పూర్తిచేశారు. మరో ఐదుగురు చిన్నారులకు శస్త్రచికిత్స నిర్వహణకు ఏర్పాట్లు పూర్తిచేశారు. వినికిడి సమస్యతో బాధపడే చిన్నారుల రెండు చెవులకు శస్త్ర చికిత్సలను అరుదుగా మాత్రమే చేస్తుంటారు. కానీ, విమ్స్‌లో ఐదుగురు చిన్నారులకు రెండు చెవులకు శస్త్ర చికిత్స విజయవంతంగా పూర్తి చేశారు. శస్త్రచికిత్స అనంతరం అవసరమైన స్పీచ్ థెరపీ, ఇతర సహకారాన్ని కూడా ఇక్కడే అందిస్తున్నారు. కాక్లియర్ ఇంప్లాంట్ శస్త్రచికిత్స బయట చేయించుకోవాలంటే భారీగా ఖర్చు అవుతుంది. సుమారు ఎనిమిది లక్షల నుంచి రూ.12 లక్షల వరకు వెచ్చించాల్సిన పరిస్థితి. ఈఎన్‌టీ ఆస్పత్రిలో ఒక చెవికి ప్రభుత్వం అందించే ఆర్థిక సాయంతో ఉచితంగా శస్త్ర చికిత్స నిర్వహిస్తే, రెండో చెవికి డబ్బులు చెల్లించి బయట చేయించుకోవాల్సిన పరిస్థితి. విమ్స్‌లో మాత్రం రెండు చెవులకు పూర్తి ఉచితంగా కాక్లియర్ ఇంప్లాంట్ శస్త్ర చికిత్సలను నిర్వహిస్తున్నారు.

## పర్యాటకంగా రాజులచెరువు అభివృద్ధి



**నరసన్నపేట, పతాకం న్యూస్:** స్థానిక రాజులచెరువును పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన డీపీఆర్‌ను సిద్ధం చేయాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సూచించారు. స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఆర్డీవో సాయిప్రత్యూష ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. 2017 తరువాత చేపట్టిన అక్రమ నిర్మాణాలను తొలగించి గట్టుమీద ఫెన్సింగ్, అవుట్‌లెట్, ఇన్‌లెట్‌లు, మురుగునీరు మళ్లింపు. వాకింగ్ ట్రాక్, సోలార్ లైట్ల ఏర్పాటుకు ఇంజనీరింగ్ శాఖ అధికారులు అంచనాలు సిద్ధం చేయాలన్నారు. పంచాయతీ, రెవెన్యూ, పోలీసు అధికారులు సమన్వయంతో అక్రమ నిర్మాణాలను తొలగించాలన్నారు. ఈ సమావేశంలో తహసీలార్ సత్యనారాయణ, ఎమ్పీడీవో వెంకటేష్ ప్రసాద్, పంచాయితీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు సత్యంనాయుడు, నర్సింగరావు, తదితరులు పాల్గొన్నారు.

## కేజీబీవీ విద్యార్థిని కుటుంబానికి అండ



**కొత్తవలస, పతాకం న్యూస్:** పాఠశాల భవనంపై నుంచి జారిపడి తీవ్రంగా గాయపడిన లోలు గు గ్రామానికి చెందిన కేజీబీవీ విద్యా ర్థిని సీహెచ్ వందన కుటుంబాన్ని ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయ పాటి శైలజ హామీ ఇచ్చారు. ఈ మేర కు విద్యార్థినిని పరామర్శిం చి ఘటనపై వివరాలను అడిగి తెలుసు కున్నారు. కేజీబీవీలో విద్యార్థినులపై సిబ్బంది ఎందుకు ఇంత నిర్లక్ష్యంగా ఉన్నారని ప్రశ్నిం చారు. పాఠశాలలో జరిగే ప్రతీ ఘటనకు ప్రిన్సిపాల్, సిబ్బందిదే బాధ్యత అని అన్నారు. ఆమె పూర్తిగా కోలుకునేంతవరకు అండగా ఉంటామన్నారు. విద్యార్థినుల పట్ల జాగ్రత్తగా ఉండాల ని కేజీ బీవీ ప్రిన్సిపాల్ లలితకు సూచించారు. విద్యార్థిని సమస్యను, ఆమె కుటుంబ పరిస్థితిని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకువెళతానని చెప్పారు. ప్రమాదం జరిగిన తీరును ఎస్ఐ వి.సత్యనారాయణ, అధికారులను అడిగి తెలుసుకున్నారు.

## లింగాపురం గ్రామంలో ఆరోగ్య అవగాహన కార్యక్రమం



**కొయ్యూరు, పతాకం న్యూస్:** అల్లూరి జిల్లా,కొయ్యూరు మండలం, డౌనూరు పీహెచ్‌సీ పరిధిలోని లింగాపురం గ్రామంలో ఏఎన్ఎమ్ తలుపులమ్మ, సీహెచ్‌డబ్ల్యూ సన్యాసమ్మ గ్రామాన్ని సందర్శించి ఆరోగ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు వివిధ రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. మలేరియా,డెంగ్యూ వంటి సంక్రమణ వ్యాధులు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే ప్రస్తుతం పొగమంచు విపరీతంగా కురుస్తున్న నేపథ్యంలో ఆరోగ్యంపై మరింత శ్రద్ధ వహించాలని ఏఎన్ఎమ్ సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన ప్రజలంతా పాల్గొని ఆరోగ్య సూచనలు తెలుసుకున్నారు.

## 450 లీటర్ల నాటుసారా స్వాధీనం



**పాతపట్నం, పతాకం న్యూస్:** ఆంధ్ర–ఒడిశా సరిహద్దు గ్రామాలలో ఇరురాష్ట్రాల ప్రొహిబిషన్ ఎండ్ ఎక్సైజ్ శాఖాధికారులు సంయుక్తంగా దాడులు చేశారు. ఈ దాడులలో 450 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్టు పాతపట్నం ఎక్సైజ్ సీఐ కోట కృష్ణారావు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాతపట్నం, మెళియాపుట్టి పలాస మండలాల సరిహద్దులో గల ఒడిశా గ్రాఆలు కుయనరా, దుర్గం, భలేరి, సింగుపూర్ గ్రామాలలో దాడులు చేపట్టామని తెలిపారు. ఈ దాడులలో టెక్కలి, పలాస, కోటబొమ్మాళి పాతపట్నం, పొందూరు, ఒడిశాలోని గారబంద, పర్లాఖిమిడి, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారని తెలిపారు. 450 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకోవడంతో పాటు సుమారు 8,650 లీటర్ల బెల్లం ఊటలను ధ్వంసం చేసి..కేసు నమోదు చేసినట్టు సీఐ కృష్ణారావు వివరించారు.

## ఉపాధి హామీ పథకం పేరు మార్పుపై నిరసన



**కొత్తవలస, పతాకం న్యూస్:** మహాత్మాగాంధీ పేరుభావితరాలకు తెలియచేయకుండా ఉండడం కోసమే గ్రామీణ ఉపాధిపథకానికి గత ప్రభుత్వం పెట్టిన పేరును మారుస్తూ కేంద్రప్రభుత్వం పార్లమెంట్‌లో బిల్లుపెట్టిందని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు ఆరోపించారు. ఈమేరకు గాంధీనగర్‌లోని అంబేద్కర్ విగ్రహంవద్ద ఉపాధిహామీ పథకం వేతనదారులతో కలిసి నిరసన తెలిపారు. పథకం పేరు మారుస్తూ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బిల్లు ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గాడి అప్పారావు, పి.రమణమ్మ,కె.కాసులమ్మ,మంగమ్మ, కోటమ్మ, జయ, లక్ష్మి పాల్గొన్నారు

## ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలి




**రోలుగుంట, పతాకం న్యూస్:** అనకాపల్లి జిల్లా మండల కేంద్రమైన రోలుగుంటలో ఈసీఆర్ డిమాండ్ అనేక పోరాటాల ఫలితంగా వచ్చిన జాతీయ ఉపాధి పథకం పేరు మార్చడం అన్యాయమని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇరెల్లి చిరంజీవి అన్నారు. కేంద్రం అమలు చేస్తున్న బడ్జెట్ బిజెపి ప్రభుత్వం వచ్చిన తర్వాత గ్రామీణ ఉపాధి కూలీలకి పని దినాలు తగ్గించుకుంటూ రావడమే కాక ఉపాధి హామీ చట్టాన్ని పేరు మార్చడం కూలీల పొట్ట కొట్టడమే అన్నారు. రాష్ట్రానికి 40 శాతం అమలు చేయడం అన్నది తీవ్ర అన్యాయమన్నారు.

## ప్రశంసనీయమైన ప్రతిభను కనబర్చిన విద్యార్థులు

**రోలుగుంట, పతాకం న్యూస్:** అనకాపల్లి జిల్లా రోలుగుంటలో నిర్వహించిన మండల స్థాయి సైన్స్ ఫెయిర్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బిబి పట్టణం విద్యార్థులు ప్రశంసనీయమైన ప్రతిభ ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో సాడి ఝాన్సీ, కసిరెడ్డి మౌనిక అనే విద్యార్థినులు "చెడు కొలెస్ట్రాల్ వి ఎస్ మంచి కొలెస్ట్రాల్" అనే ప్రాజెక్ట్ గ్రూప్ విభాగంలో పాల్గొని ప్రతిభ కనబరిచారు. సమీక్షకులు వారి ప్రాజెక్టు ప్రశంసించి, జిల్లా వారిని స్థాయి సైన్స్ ఫెయిర్కు ఎంపిక చేసినట్లు తెలిపారు. విద్యార్థినుల ప్రతిభ పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.వి. చంద్రశేఖరరావు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సైన్స్ విభాగ ఉపాధ్యాయులు సి.హెచ్.వి. ప్రభాకర్ మరియు జె. సుగుణ లు విద్యార్థినులను ప్రోత్సహించి, మార్గదర్శకత్వం వహించినందుకు ప్రధానోపాధ్యాయులు అభినందించారు. ఈ విజయం బిబి పట్టణం పాఠశాలకు గర్వకారణంగా నిలిచింది.

## స్టాఫ్ నర్సుల సంఖ్యను పెంచాలి



**కర్నూలు, పతాకం న్యూస్:** జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఒక్కొక్క పీహెచ్‌సీలో స్టాఫ్ నర్సుల సంఖ్యను మూడు నుంచి నాలుగింటికి పెంచాలని ఏపీ గవర్నమెంటు నర్సెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.లీలావతి, సి.బంగారి, డీఎంహెచ్‌వోకు వినతి పత్రం అందజేశారు. సాయంత్రం డీఎంహెచ్‌వో డా.ఎల్.భాస్కర్‌ను కలిసి పలు సమస్యలను వివరించారు. పీహెచ్‌సీలో కేవలం ముగ్గురు స్టాఫ్ నర్సులు ఉండటంతో ఏదైనా అత్యవసర పరిస్థితి ఉండి సెలవు పెట్టలేని పరిస్థితి నెలకొందన్నారు. స్టాఫ్ నర్సుల సెలవులో ఉన్నప్పుడు ఆ స్థానంలో ఎంఎల్‌హెచ్‌పీ గానీ సూపర్ వైజర్స్, ఏఎన్ఎం సిబ్బందితో సర్దుబాటు చేయాలని కోరారు.గతంలో డీఎంహెచ్‌వో ఇచ్చిన ఆర్డర్స్‌ను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో నర్సెస్ అసోసియేషన్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ జి.శాంతిభవాని, జిల్లా కోశాధికారి ఎన్.లక్ష్మినరసమ్మ పాల్గొన్నారు.

## బీటెక్ మానేసి ఏటీఎమ్‌ల వద్ద చోరీలు



**అనపర్తి, పతాకం న్యూస్:** చెడు వ్యసనాలకు బానిసై కారులో తిరుగుతూ జల్సాలు చేయాలన్న కోరికతో బీటెక్‌ను మధ్యలోనే ఆపి ఏటీఎమ్ సెంటర్ల వద్ద నేరాల బాట పట్టిన నెల్లూరుకు చెందిన కందుకూరు ఫణీంద్ర అనే యువకుడిని అనపర్తిలో ఎస్‌బీఐ ఏటీఎమ్ సెంటర్ వద్ద అనపర్తి ఎస్ఐ శ్రీనునాయక్ సిబ్బందితో కలిసి అరెస్టు చేశారు. అతడి నుంచి కారు, 10 ఏటీఎమ్ కార్డులు, రూ.3వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబ ంధించిన వివరాలను బుధవారం తూర్పు గోదావరి జిల్లా అనపర్తి పోలీస్ స్టేషన్‌లో ఏర్పా టు చేసిన విలేకర్ల సమావేశంలో రాజమహేంద్రవరం ఈస్ట్ జోన్ డీఎస్పీ బి.విద్య వివరించారు. నెల్లూరుకు చెందిన కందుకూరు ఫణీంద్ర చెడు వ్యసనాలకు బానిసై కారులో తిరుగుతూ జాల్సాలు చేయాలని భావించి బీటెక్ చదువును మధ్యలోనే నిలిపి నేరాల బాట పట్టాడు. సులువుగా డబ్బు సంపాదించాలన్న కోరికతో ఏటీ ఎమ్‌ల వద్ద సొమ్ములు విత్ డ్రా చేసుకునేందు కు వచ్చే వృద్ధులు, నిరక్ష్యరాస్యులను టార్గెట్‌గా చేసుకునేవాడు. వారిని మాయలో పడేసి పిన్ తెలుసుకుని సులువుగా ఏటీఎమ్ కార్డులను మా ర్చి తరువాత వారి ఖాతాల నుంచి సొమ్ములను చోరీ చేయడం అలవాటు చేసుకున్నాడు. 2017 నుంచి 2020 వరకు వివిధ ప్రాంతాల్లో మోసాలకు పాల్పడడంతో అతడిపై 7 కేసులు నమోదు కాగా జైలుకు వెళ్లి వచ్చాడు. తరువాత కూడా అతడి ప్రవర్తనలో మార్పు రాలేదు. 2024లో రెండు చోట్ల, 2025లో మూడు చోట్ల ఇదే తరహా నేరాలకు పాల్పడి తప్పించుకు తిరుగుతున్నాడు. 2024లో అనపర్తి మండలం కొప్పవరం గ్రామానికి చెందిన సిద్దాబత్తుల ముత్యాలు అనపర్తి కెనాల్‌రోడ్డులోని ఎస్‌బీఐ ఏటీఎమ్ వద్ద డబ్బులు డ్రా చేసుకునేందుకు వెళ్లడంతో అతడిని మాటల్లో పెట్టి కార్డు మార్చి రూ.35వేలు చోరీ చేయడంతో అనపర్తి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. మంగళవారం కెనాల్ రోడ్డు లో ఎస్‌బీఐ ఏటీఎమ్ వద్ద ఫణీంద్ర కదలికలు అనుమానంగా ఉండడంతో ఎస్ఐ శ్రీను నాయక్ అతడిని ప్రశ్నించగా సరైన సమాధానం రాకపోవడంతో పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించగా నేరాలు బయపడ్డాయని డీఎస్పీ తెలిపారు. నిందితుడి నుంచి కారు, 10 ఏటీఎమ్ కార్డులు, రూ.3వేలు స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరుపరుచనున్నట్టు డీఎస్పీ తెలిపారు. సమావేశంలో సీఐ సుమంత్, ట్రైనీ ఎస్ఐ సుజాత, అడిషనల్ ఎస్ఐ దుర్గాప్రసాద్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

## మినీ స్టేడియం ఆధునికీకరణకు రూ.2.37కోట్లు



**ఒంగోలు, పతాకం న్యూస్:** ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ సూచనతో నగరంలోని మినీస్టేడియం అభివృద్ధికి రూ.2.37 కోట్లుకేటాయించినట్లు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) చైర్మన్ రవినాయుడు తెలిపారు. ఒంగోలు వచ్చిన ఆయన మినీ స్టేడియంను పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రాన్ని క్రీడాంధ్రప్రదేశ్‌గా మార్చడానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అనేక సంస్కరణలు చేశారని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో క్రీడలను పూర్తిగా నిర్వీర్యం చేశారని విమర్శించారు. స్పోర్ట్స్ పాలసీ లేకుండా, క్రీడాకారులకు కనీస ప్రోత్సాహకాలు కూడా ఇవ్వకుండా అన్యాయం చేశారని మండిపడ్డారు. ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత క్రీడల అభివ ృద్ధికి అనేక చర్యలు తీసు కున్నదని తెలిపారు. ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు రూ.2.25 కోట్లతో ఉమ్మడి జిల్లాలోని దర్శి, అద్దంకి, వైపాలెంలో క్రీడా వికాస కేంద్రాల పనులు చేపట్టి త్వరలో అందు బాటులోకి తెస్తామని పేర్కొన్నారు. వచ్చే విద్యా సంవ త్సరం నాటికి ఒంగోలు మినీస్టేడియంలోఇండోర్, అవుట్ డోర్ క్రీడలతోపాటు, బాక్సింగ్, ఖోఖో గ్రౌండ్‌లను, వాకింగ్ ట్రాక్‌ను అందుబాటులో తెస్తామన్నారు. రంగారాయుడు చెరువుకట్టపై వాకింగ్ ట్రాక్, డీఆర్ఆర్ఎం స్కూలులో ఫుట్‌బాల్ మైదానం, సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు పక్కన వాలీబాల్ కోర్టు, కర్నూలు రోడ్ ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద షటిల్ కోర్టును నిర్మిస్తామని చెప్పారు. ఈ పనులు మరో రెండు నెలల్లో మొదలుపెడతామని వెల్లడించారు. వైసీపీ హయాంలో చేపట్టిన ఆడుదాం ఆంధ్రలో కోట్ల రూపాయల అవినీతి జరిగిందని, ఆ లెక్కలన్నీ తేల్చి బాధ్యులందరిపై చర్యలు తీసుకుంటామని రవినాయుడు పేర్కొన్నారు.

# మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి తూట్లు!



**న్యూఢిల్లీ పతాకం న్యూస్:** పని పొందడాన్ని హక్కుగా మార్చిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పక్కన పెట్టాలని నిర్ణయించడం పేదలపై కేంద్ర ప్రభుత్వం చేసిన క్రూర దాడి. దాని స్థానంలో పరిమిత నిధులతో అరకొరగా ఉపాధి కల్పించడానికి అవకాశం కల్పించే వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవిక మిషన్ (గ్రామీణ్) (విబిజి–ఆర్ఎఎంజి) అనే కొత్త పథకాన్ని అమలు చేయనున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ప్రతిపక్షాల తీవ్ర నిరసనల మధ్య దీనికి సంబంధించిన బిల్లును కూడా లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. కేంద్రం ప్రతిపాదించిన ఈ కొత్తబిల్లు ఉపాధి పొందడం హక్కు అనే భావనను పూర్తిగా తుడిచి పెట్టేస్తుంది. చట్టాన్ని పథకంగా పరిమితం చేయడం ద్వారా ప్రభుత్వ దయాదాక్షిణ్యాలపై పేదలను ఆధారపడేలా చేస్తుంది. ఇప్పటి వరకు కూలీల డిమాండ్‌బట్టి ఉపాధిని కల్పించే విధానాన్ని మార్చివేసి స్థానికంగా అవసరం ఉంటేనే పనులు కేటాయించే పద్ధతిని అమలు చేయనున్నారు. చట్టానికి ఇప్పటిదాకా ఉన్న మహాత్మాగాంధీ పేరును కూడా నూతన బిల్లు తొలగిస్తుంది. నిధుల కోసం రాష్ట్రాలను మరింతగా కేంద్రంపై ఆధారపడేలా చేస్తుంది. తద్వారా, పేదలకు పెనుభారంగా మారుతున్న ఉదారవాద ఆర్థిక సంస్కరణల ఎజెండాను మరింతగా ముందుకు తీసుకుపోవడానికి కేంద్ర ప్రభుత్వానికి అవకాశం దొరుకుతుంది.

వామపక్షాల మద్దతుతో దేశాన్ని పాలించిన తొలి యుపిఎ ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రూపొందించింది. సార్వత్రిక ఉపాధి హక్కును సాధించాలనే లక్ష్యంతో ఈ చట్టాన్ని అప్పటి ప్రభుత్వం అమలులోకి తీసుకువచ్చింది. ఈ చట్టం అమలు గ్రామాల ఆర్థిక, సామాజిక స్థాయిల్లో ఆశ్చర్యకరమైన మార్పును తీసుకువచ్చింది. కేంద్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారమే గ్రామీణాభివద్ధికి ఇది గొప్పగా దోహదపడింది. గ్రామీణ నిరుద్యోగానికి కొంతవరకు పరిష్కారంగా నిలిచింది.

దీని ద్వారా లభించిన పనుల్లో దేశ వ్యాప్తంగా 50 నుండి 60 శాతం వరకు మహిళలే పాల్గొన్నారని గణాంకాలు చెబుతున్నాయి. ఇది వారి సాధికారతకు మార్గం వేసింది. ఉపాధి కోసం నగరాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి నుంచి గ్రామీణులను కొంత మేరకు కాపాడింది. కరువు కాటకాలు విరుచుకుపడినప్పుడు అండగా నిలిచింది. గ్రామీణ ప్రాంతాల్లో, వ్యవసాయ పనుల్లో కూలీ రేట్లకు స్థిరత్వాన్ని తీసుకువచ్చింది.

అనేక రాష్ట్రాల్లో 'ఉపాధి' పనుల ద్వారా నీటి పారుదల సౌకర్యాలు కల్పించారని, చెరువులు, బావులు, రోడ్లు నిర్మించారని నివేదికలు చెబుతున్నాయి. ఇంత విస్తృతంగా, బహుముఖంగా క్షేత్ర స్థాయిలో పేద ప్రజలకు ఉపయోగపడిన చట్టం మరొకటి లేదని చెప్పవచ్చు. బిజెపి అనుసరించే భూస్వామ్య, పెట్టుబడిదారీ, మతవాద రాజకీయ ఎజెండాకు ఇది భిన్నం! మహాత్మా గాంధీ పేరు కూడా వారికి తీవ్ర అసహనాన్ని కలిగించింది. అందుకే, అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఈ చట్టాన్ని నీరుగార్చే కుట్రలు ఎన్నో చేశారు. నిధులు కోత పెట్టడంతోపాటు, చేసిన పనికి కూలీ ఇవ్వకపోవడం, అనేక ఆంక్షలు విధించడం వంటి చర్యలకు దిగారు.

చివరకు ఉపాధి హామీ చట్టం లక్ష్యాన్నే ధ్వంసం చేస్తూ, దానితో ఏ మాత్రం పోలిక లేని 'విబిజి–ఆర్ఎఎంజి'ని రూపొందించారు. దీని ద్వారా చట్టం అమలు పూర్తిగా కేంద్ర ప్రభుత్వ నియంత్రణలోకి తీసుకువస్తున్నారు. బిల్లులో పేర్కొన్న అంశాల ప్రకారం ప్రస్తుతం రాష్ట్రాల వాటా ఉన్న 10 శాతం మొత్తాన్ని 40 శాతానికి పెంచనున్నారు.

ఈ ఒక్క చర్య వల్లే మన రాష్ట్రంపై నాలుగువేల కోట్ల రూపాయల అదనపు భారం పడుతుందని అంచనా! ఇది 11 కోట్ల మంది కూలీల ఉపాధికి గండి కొడుతుంది. ప్రతి ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రాలకు ఎంత నిధి ఇవ్వాలన్నది కేంద్ర ప్రభుత్వమే నిర్ణయిస్తుంది. కేటాయింపును మించి ఖర్చు చేస్తే (పేదలకు పనులు కల్పిస్తే) ఆ మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించాలి. అదే విధంగా ఉపాధి కల్పించలేకపోతే పరిహారాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వాలే చెల్లించాలి! దీని అర్థం నిధులు సమకూర్చే బాధ్యత నుండి కేంద్ర ప్రభుత్వం చట్టపరంగా తప్పుకోవడమే! వ్యవసాయ పనుల కాలంలో 60 రోజుల వరకు ఉపాధి పనులను నిలిపివేయవచ్చని బిల్లులో పేర్కొనడం, కేంద్ర ప్రభుత్వం నోటిఫై చేసే రంగాల్లోనే పథకం అమలవ్వాలనే నిబంధన విధించడం ఎవరికి మేలు చేస్తుందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. 100 రోజుల ఉపాధిని 125 రోజులకు పెంచుతున్నట్లు పేర్కొనడం కూడా కేవలం ప్రచారానికే తప్ప ఆచరణలోకి రాదు. ఈ నేపథ్యంలో పేద ప్రజలకు అన్ని విధాల హాని చేసే కేంద్ర ప్రభుత్వ చర్యను ప్రతిఘటించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది.

# సీఎం చంద్రబాబు నాయుడుకు 'బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్' అవార్డు

**అమరావతి, పతాకం న్యూస్:** దేశంలోని ప్రముఖ దినపత్రిక 'ది ఎకనామిక్ టైమ్స్' అందించే అవార్డు ఈసారి ముఖ్యమంత్రి చంద్రబాబును వరించింది. ఆంధ్రప్రదేశ్‌లో వ్యాపార అనుకూల విధానాల అమలు, పారిశ్రామిక సంస్కరణలు, రాష్ట్రానికి పెద్దఎత్తున పెట్టుబడులు ఆకర్షిస్తున్నందుకు గానూ చంద్రబాబు నాయుడుకు 'బిజినెస్ రీఫార్మర్ ఆఫ్? ది ఇయర్?' అవార్డు ఇస్తున్నట్టు ఎకనామిక్ టైమ్స్ ప్రకటించింది. మార్చిలో నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చేతుల మీదుగా ఈ అవార్డును చంద్రబాబుకు ప్రదానం చేయనున్నారు. ఈ అవార్డును దేశంలోని ప్రముఖ పారిశ్రామికవేత్తలు, ఆర్థిక నిపుణులు, న్యాయవేత్తలతో కూడిన అత్యున్నత స్థాయి జ్యూరీ ఎంపిక చేసింది.

జ్యూరీ : ఈసారి జ్యూరీలో భారతీ గ్రూప్ చైర్మన్ సునీల్ భారతీ మిట్టల్, జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ చైర్మన్ సజ్జన్ జిందాల్, కోటక్ మహీంద్రా బ్యాంక్ వ్యవస్థాపకులు ఉదయ్ కోటక్, నారాయణ హెల్త్ వ్యవస్థాపకులు డాక్టర్ దేవిశెట్టి, సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి, టాటా ట్రస్ట్స్ చైర్మన్ నోయెల్ టాటా వంటి ప్రముఖులు సభ్యులుగా ఉన్నారు. జ్యూరీకి డెలాయిట్ సంస్థ సలహాదారుగా వ్యవహరిస్తోంది.

ఈ అవార్డును 2024లో కేంద్రమంత్రులు అశ్వినీ వైష్ణవ్, 2023లో ఎస్. జైశంకర్, 2021లో నిర్మలా సీతారామన్, 2019లో మహారాష్ట్ర మాజీ సీఎం దేవేంద్ర ఫడణవీస్, 2017లో కేంద్ర మాజీ మంత్రి అరుణ్ జైట్లీ, 2015లో పీయూష్ గోయల్ వంటి వారు అందుకున్నారు. ప్రతిష్టాత్మక అవార్డు అందుకోవడంపై ప్రముఖులు, మంత్రి వర్గ సహచరులు ముఖ్యమంత్రికి శుభాకాంక్షలు తెలిపారు.



ముఖ్యమంత్రి చంద్రబాబును ఎకనామిక్ టైమ్స్ సంస్థ 'బిజినెస్ రీఫార్మర్ ఆఫ్ ద ఇయర్' అవార్డు వరించడం ఆంధ్రప్రదేశ్‌కు గర్వకారణమని మంత్రి లోకేశ్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి, తమ కుటుంబానికి ఇది ఎంతో ప్రతిష్టాత్మకమని ఆయన అన్నారు. దేశంలో సంస్కరణల ప్రయాణాన్ని స్పష్టత, ధైర్యం, స్థిరత్వంతో ముందుకు తీసుకెళ్లిన అరుదైన నాయకుల్లో చంద్రబాబు ఒకరని జ్యూరీ ప్రశంసించిందని తెలిపారు. పాలనలో 'సంస్కరణలు, వేగం, విశ్వాసం' అనే మూడు సూత్రాలపై చంద్రబాబు చూపిన అచంచల నిబద్ధతకు ఈ అవార్డు నిదర్శనమన్నారు. రాష్ట్రాభివృద్ధికి, పెట్టుబడుల ఆకర్షణకు, సంస్కరణాత్మక పాలనకు చంద్రబాబు నాయకత్వం దేశవ్యాప్తంగా ఆదర్శంగా నిలుస్తోందన్నారు. సంస్కరణలే మార్గం.. పాలనలో విశ్వాసమే తమ లక్ష్యమని లోకేశ్? స్పష్టం చేశారు.

విజనరీ లీడర్ చంద్రబాబు ప్రతిష్టాత్మక అవార్డుకు ఎంపిక కావడం తెలుగు వారందరికీ గర్వకారణమని మంత్రులు గొట్టిపాటి రవి, డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి, కొల్లు రవీంద్ర, అనగాని సత్యప్రసాద్, అనిత, అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్, వాసంశెట్టి సుభాష్, గుమ్మడి సంధ్యారాణి, మండిపల్లి, బీసీ జనార్ధన్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో పారిశ్రామిక రంగంలో విప్లవాత్మక సంస్కరణలతో నూతన ఒరవడికి శ్రీకారం చుట్టిన నాయకుడు చంద్రబాబు అని కొనియాడారు. సీఎం చంద్రబాబు నాయకత్వంపై నమ్మకంతోనే రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్?ను పెట్టుబడుల హబ్?గా తీర్చిదిద్ది దేశానికి ఆదర్శంగా నిలిపిన నాయకుడు చంద్రబాబు అని మంత్రులు పేర్కొన్నారు.

పెట్టుబడుల ఆకర్షణ, మౌలిక సదుపాయాల అభివృద్ధి, పారిశ్రామిక రంగ సంస్కరణల్లో ముఖ్యమంత్రి కృషికి ఈ అవార్డు నిదర్శనమని మంత్రులు అన్నారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ సాధిస్తున్న గణనీయమైన ప్రగతి ఈ అవార్డును తెచ్చిపెట్టిందన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజాసంక్షేమం కోసం చంద్రబాబు అవిశ్రాంత కృషి చేస్తున్నారన్నారు. చంద్రబాబు నాయుడు లాంటి నేత దొరకడం రాష్ట్ర ప్రజల అదృష్టమన్నారు. వ్యాపార అనుకూల విధానాలతో ఆంధ్రప్రదేశ్‌ను పెట్టుబడుల కేంద్రంగా ముఖ్యమంత్రి చంద్రబాబు తీర్చిదిద్దుతున్నారని మంత్రులు ప్రశంసించారు

# తరచూ 'తలనొప్పి' ఎందుకు వస్తుందో తెలుసా?

తలనొప్పి ఏదో సమయంలో అందరినీ వేధిస్తుంది. చిరాకు, సహనం కోల్పోయేలా చేస్తుంది. అయితే, దీని ప్రభావం ఒక్కొక్కరిపై ఒక్కోలా ఉంటుంది. దీన్ని తగ్గించుకోవడానికి విశ్వప్రయత్నాలు చేస్తుంటారు. కాఫీ తాగడం,' ఎయిన్ రిలీవర్స్ వాడడం, ఇంకా ఎక్కువైతే డాక్టర్‌ని సంప్రదిస్తుంటారు. ఈ క్రమంలో తలనొప్పికి కారణమయ్యే కొన్ని సాధారణ కారణాలు జీవనశైలికి సంబంధించినవి ఉంటాయంటున్నారు నిపుణులు. మరి, అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం! అకారణంగా తలనొప్పి వేధిస్తుంటే రోజూ ఎన్ని నీళ్లు తాగుతున్నారో ఒకసారి చెక్ చేసుకోవాలంటున్నారు నిపుణులు. నీటి శాతం తగ్గినా తలనొప్పి రావొచ్చని చెబుతున్నారు. శరీరంలో నీరు తగ్గినప్పుడు మెదడు తాత్కాలికంగా కుంచించుకుపోతుందని పేర్కొంటున్నారు. దీంతో మెదడు పుర్రె నుంచి కాస్త వెనక్కి జారి, నొప్పికి దారితీస్తుందని హెచ్చరిస్తున్నారు. ఈ క్రమంలో తగినన్ని నీళ్లు తాగగానే యథాస్థితికి వస్తుందని తెలియజేస్తున్నారు. ఫలితంగా, నొప్పి తగ్గుతుందని సూచిస్తున్నారు. డీహైడ్రేషన్ తలనొప్పికి కారణమవుతుందని అధ్యయనం పేర్కొంది. భోజనం దాటవేయడం వల్ల కూడా తలనొప్పి రావొచ్చంటున్నారు నిపుణులు. తరచూ తలనొప్పితో బాధపడేవారు దీన్ని గుర్తుంచుకోవాలని సూచిస్తున్నారు. కొందరికి పిండి పదార్థాలు, మిఠాయిల వంటివి తిన్నప్పుడూ నొప్పి వస్తుండొచ్చని పేర్కొంటున్నారు. ఇలాంటివి గమనిస్తే ఆయా పదార్థాలకు దూరంగా ఉండటం మేలని సలహా ఇస్తున్నారు. సరిగా కూర్చోకపోవటం, నిలబడకపోవటం వల్ల తల, మెడ, దవడలు, భుజాల వెనక కండరాలు ఒత్తిడికి లోనవుతాయంటున్నారు నిపుణులు. ఎక్కువసేపు ఇలాగే ఉండిపోతే అక్కడి నాడుల మీదా ఒత్తిడి పెరుగుతుందని చెబుతున్నారు. ఇది తలనొప్పికి దారితీస్తుందని వివరిస్తున్నారు.



పేలవమైన భంగిమ కారణంగా తలనొప్పి రావొచ్చని అధ్యయనం పేర్కొంది. రాత్రిళ్లు గాఢ నిద్రపోకుండా మధ్య మధ్యలో మేల్కొవడం, తగినన్ని గంటలు నిద్ర లేకపోవడం వల్ల తలనొప్పి వస్తుందంటున్నారు నిపుణులు. నిద్రలో దంతాలను బిగించడం, నిద్రకు ముందు గట్టిగా ఉన్న ఆహారాన్ని నమలడం వల్ల తలనొప్పి రావొచ్చని చెబుతున్నారు. అలాగే, దిండు సరిగా లేకపోతే భుజం, మెడ కండరాలు ఒత్తిడికి గురవుతాయని, ఇది తలనొప్పికి కారణమవుతుందని వివరిస్తున్నారు.

రాత్రిళ్లు స్మోకింగ్ చేయడం, మద్యాన్ని తీసుకోవడం వల్ల నిద్రకు భంగం కలుగుతుందని నిపుణులు చెబుతున్నారు. ఈ క్రమంలో మద్యంతో మూత్రం ఎక్కువగా వస్తుందంటున్నారు. మూత్రంతో పాటు ఉప్పు, విటమిన్లు, ఖనిజాలు బయటకు పోతాయని పేర్కొంటున్నారు. దీంతో శరీరంలో నీరు, ఖనిజ లవణాల సమతుల్యత అస్తవ్యస్తమై తలనొప్పి రావొచ్చని వివరిస్తున్నారు. ఆల్కహాల్, ముఖ్యంగా రెడ్ వైన్ కారణంగా తలనొప్పి రావొచ్చని అధ్యయనం పేర్కొంది.

జలుబు, ఫ్లూ, అలర్జీ కారణంగా ఊపిరి సరిగ్గా అందకపోవడం, వాతావరణ కాలుష్యమూ తలనొప్పికి దారితీస్తాయంటున్నారు నిపుణులు. అలాగే, ఒత్తిడి, ఆందోళన కారణంగా హార్మోన్ల సమతుల్యత దెబ్బతింటుందని చెబుతున్నారు. దీంతో తలపట్టేసినట్టుగా ఉండి నొప్పి వస్తుందని పేర్కొంటున్నారు.

తలనొప్పి వచ్చినప్పుడు నీరు ఎక్కువగా తీసుకోవాలని అధ్యయనం పేర్కొంది. మజ్జిగ వంటి చలవ చేసే పదార్థాలు తీసుకోవడం మంచిదంటున్నారు నిపుణులు. చెవి దగ్గర, నుదురు, తలపై భాగాల్లో మసాజ్ చేయడం మేలని సూచిస్తున్నారు. ముక్కు పై నుంచి కిందికి మసాజ్ చేయడం, నొక్కడం వంటివి చేయాలని పేర్కొంటున్నారు. ఇలా చేస్తే రక్తప్రసరణ బాగా జరిగి తలనొప్పి తగ్గుతుందని వివరిస్తున్నారు. అలాగే, చెవి వెనక మసాజ్ చేయాలని తెలియజేస్తున్నారు. చెవిని బాగా తిప్పి పైకి కిందకి కొద్దిగా లాగడం వల్ల కూడా ఉపశమనం లభిస్తుందని వివరిస్తున్నారు. శ్వాస వ్యాయామం చేయడం వల్ల కూడా తలనొప్పి నుంచి ఉపశమనం లభిస్తుందంటున్నారు నిపుణులు. ఇలా చేయడం వల్ల మెదడుకి ఆక్సిజన్ అంది రక్తప్రసరణ బాగా జరుగుతుందని చెబుతున్నారు. దీని వల్ల తలనొప్పి నుంచి ఉపశమనం కలుగుతుందని పేర్కొంటున్నారు. కుర్చీలో కూర్చున్నప్పుడు వెన్నుముక నిటారుగా ఉండాలంటున్నారు నిపుణులు. పాదాలు నేలకు సమాంతరంగా ఆని ఉండాలని సూచిస్తున్నారు

నిద్రకు ఉపక్రమించే ముందు ధూమపానం, మద్యం జోలికి వెళ్లకపోవడమే మంచిదంటున్నారు.

# "బాడీ స్ప్రే" అతిగా వాడుతున్నారా?



కళాశాల, ఆఫీస్, మీటింగ్స్, ఫ్యామిలీ ఫంక్షన్, సినిమా థియేటర్ ఇలా ఎక్కడికి వెళ్లినా కొంత మందికి బాడీ స్ప్రే తప్పనిసరి. చెమట నుంచి వచ్చే దుర్వాసనను తప్పించుకునేందుకు కొందరు, మంచి సువాసన కోసం మరికొందరు వీటిని వాడుతుంటారు. వీరిలో గంట గంటకూ వాడేవాళ్లూ ఉన్నారు. అతిగా బాడీ స్ప్రేలు వినియోగిస్తే వాటిలోని రసాయనాల కారణంగా చర్మ సంబంధిత సమస్యలు వస్తాయంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో బాడీ స్ప్రేలను అతిగా ఉపయోగించడం వల్ల ఎలాంటి సమస్యలు వస్తాయో ఇప్పుడు తెలుసుకుందాం! చెమట వాసన తప్పించుకునేందుకు, తాజా అనుభూతి పొందేందుకు చాలామంది బాడీ స్ప్రేను వాడుతుంటారు. మోతాదుకు మించి వాడినా, అధిక రసాయనాలున్నవి ఉపయోగించినా సమస్యలు తప్పవంటున్నారు నిపుణులు. బాడీ స్ప్రేలు వినియోగించి చర్మవ్యాధులు బారిన పడిన 107 మందిలో 97 మందికి ఫ్రాగ్రెన్స్ వల్ల సమస్యలు వచ్చాయని, వీరిలో 51 మందిలో చర్మ సమస్యలకు ప్రొపిలిన్ గ్లైకాల్ అనే రసాయనాలు కారణమైందని జర్నల్ ఆఫ్ క్లినికల్ అండే ఏస్తటిక్ డెర్మటాలజీ అనే నివేదికలో వెల్లడైంది. ఉత్తర భారతదేశంలో 2150 మందిపై పరిశోధనలు చేయగా 400 మందికి కాస్మెటిక్ వల్ల చర్మ వ్యాధులు వచ్చాయని, ఇందులో 56 మందికి బాడీ స్ప్రేలు వాడటం వల్ల సమస్యలు ఎదురయ్యాయని ఇండియన్ జర్నల్ ఆఫ్ డెర్మటాలజీ నివేదిక పేర్కొంది. యాంటిబయాటిక్ ఏజెంట్స్ - ట్రైక్లోజన్, ప్రొపిలిన్, గ్లైకాల్, క్వార్టర్నరీ అమ్మోనియం కాంపౌండ్. హెక్షైల్ సిన్నామాల్డిహైడ్ (ఫ్రాగ్రెన్స్) లిమోనిన్, లినోలాల్. చెమట నుంచి వచ్చే దుర్వాసనను పీల్చే స్వభావం కలిగిన రసాయనాలు : సోడియం యాసిడ్ కార్బొనేట్, జింక్ కార్బొనేట్, టాల్క్. వీటితో పాటు ఆల్కహాల్, ప్రొపిలిన్ గ్లైకాల్, పారాబెన్స్, ప్రిజర్వేటివ్స్ వంటి వివిధ రకాల రసాయనాలు ఉంటాయి. బాడీ స్ప్రే అతిగా వినియోగిస్తే ఆరోగ్యానికి ప్రమాదమే. ఆల్కహాల్, పారాబెన్ లేని వాటిని ఎంపిక చేసుకుంటే మంచిది. చర్మ వ్యాధులు రాకుండా ఉండాలంటే ఏదైనా బాడీ స్ప్రే తీసుకున్నప్పుడు రెండు రోజులపాటు చెవి వెనుక భాగం లేదా చేతి వెనుక స్ప్రే చేసుకోవాలి. చర్మం రంగులో మార్పు కనిపిస్తే వాటికి దూరంగా ఉండటం మంచిది. రసాయనాలు శరీరంలోకి వెళ్లడం వల్ల దీర్ఘకాలంలో కాంటాక్ట్ డెర్మటైటీస్, హైపర్ పిగ్మెంటేషన్, గ్రాన్యూలోనూ వంటి చర్మ వ్యాధులు వస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో విచ్చలవిడిగా ఫ్రాగ్రెన్స్, ప్రొపిలిన్ గ్లైకాల్, అల్యూమినియం కాంపోనెంట్ వంటి రసాయనాలు కలిగిన బాడీ స్ప్రేలు ఎక్కువగా ఉన్నాయి. ఇవి లేని వాటిని చూసి తీసుకోవాలంటున్నారు. స్ప్రేలకు బదులుగా హానికారక రసాయనాలు లేని రోలర్స్ వంటివి వినియోగించడం మేలని సూచిస్తున్నారు.



# డుమ్మా కొట్టే సర్కారీ డాక్టర్ల 'ఆట'కట్టు

## సర్కారీ డాక్టర్ల 'ఆట'కట్టు..



**అమరావతి, పతాకం న్యూస్:** ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు దేవుళ్లు. కానీ ఆ దేవుళ్లు గుడిలో ఉంటేనే కదా భక్తులకు మోక్షం. ఇక్కడ మాత్రం పరిస్థితి వేరు. సర్కారు కొలువులో ఉంటారు కానీ ఆసుపత్రి గడప తొక్కరు. ఏళ్లు గడుస్తున్నా విధులకు హాజరుకారు. జీతాలు మాత్రం ఠంఛనుగా పడతాయో లేదో తెలియదు కానీ, ప్రభుత్వ ఉద్యోగి అనే ట్యాగ్ మాత్రం వాడుకుంటారు. ఇన్నాళ్లూ రాజకీయ అండదండలతో 'ఆడిందే ఆట, పాడిందే పాట'గా సాగిన వీరి వ్యవహారానికి ఎట్టకేలకు చెక్ పడనుంది. ప్రభుత్వ అనుమతి లేకుండా ఏళ్ల తరబడి విధులకు గైర్హాజరవుతున్న 62 మంది వైద్యులపై చర్యలకు ప్రభుత్వం కొరడా ఝుళిపించింది. వైద్యారోగ్య శాఖలో ఈ తంతు ఈనాటిది కాదు. గత కొన్ని ఏళ్లుగా 62 మంది వైద్యులు ఆసుపత్రుల ముఖం చూడటం లేదు. వీరిలో అత్యధికులు స్పెషలిస్ట్ డాక్టర్లే కావడం గమనార్హం. ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంతో ఇన్నాళ్లూ వీరి ఆగడాలు సాగిపోయాయి. రాజకీయ నాయకుల సిఫార్సులు, ఇతరత్రా ఆశీస్సులు ఉండడంతో వీరిని ప్రశ్నించే నాథుడే లేకుండా పోయాడు. గతంలో కొందరు ఇలాగే గైర్హాజరైతే, పైస్థాయి ఒత్తిళ్లతో ఆ సెలవులను 'క్రమబద్ధీకరించారు'. దీంతో మిగిలిన వారిలోనూ భయం లేకుండా పోయింది. పరిస్థితి మరీ శృతిమించుతుండడంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. క్రమశిక్షణ చర్యలకు ఉపక్రమించింది. ఏడాదికి పైగా ఎలాంటి అనుమతి లేకుండా విధులకు డుమ్మా కొట్టిన వారి జాబితాను సిద్ధం చేసింది. ఇందులో 12 మంది అసోసియేట్ ప్రొఫెసర్లు, 48 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ఇద్దరు ట్యూటర్లు ఉన్నారు. వీరందరికీ వైద్య విద్య సంచాలకులు (డీఎంఈ) డాక్టర్ జి.రఘునందన్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. 31 డెడ్‌లైన్, లేదంటే ఇంటికే: ఈసారి చర్యలు కఠినంగా ఉంటాయని డీఎంఈ హెచ్చరించారు. 'ప్రభుత్వ అనుమతి లేకుండా ఏడాదికి పైగా గైర్హాజరైన వారి సేవలను తాత్కాలికంగా రద్దు చేయాలని నిర్ణయించాం. అసలు మీ ఉద్యోగాలను ఎందుకు పూర్తిగా రద్దు చేయకూడదో వివరణ ఇవ్వాలి' అని నోటీసుల్లో పేర్కొన్నారు. ఈ నెల 31వ తేదీ లోపు సంబంధిత వైద్యులు వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇవ్వాల్సి ఉంటుంది. గడువులోగా లిఖితపూర్వక సమాధానం ఇవ్వకపోతే వారిని శాశ్వతంగా ఇంటికి సాగనంపుతామని స్పష్టం చేశారు. గైర్హాజరైన వారి చిట్టా చూస్తే కళ్లు బైర్లు కమ్మడం ఖాయం. కొందరు ఆరేళ్లుగా విధులకు రావడం లేదు. అనంతపురం ప్రభుత్వ వైద్య కళాశాలలో ఆర్థోపెడిక్స్ విభాగం ట్యూటర్‌గా ఉన్న డాక్టర్ జీఎస్ రవి, ఏకంగా 2019 మార్చి 18 నుంచి విధులకు దూరంగా ఉన్నారు. అంటే ఆరేళ్లుగా ఆయన ఆచూకీ లేదు. విజయవాడ సిద్ధార్థ వైద్య కళాశాలలో పెథాలజీ ట్యూటర్ 2021 ఫిబ్రవరి 1 నుంచి (నాలుగేళ్లకు పైగా) గైర్హాజరవుతున్నారు.

: కీలకమైన బాధ్యతల్లో ఉన్న అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు కూడా ఏళ్ల తరబడి విధులకు రావడం లేదు. విశాఖపట్నం ఆంధ్ర మెడికల్ కాలేజీలో పీడియాట్రిక్ సర్జరీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం. జగన్ మోహన్ 2022 ఫిబ్రవరి 7 నుంచి రావడం లేదు. కర్నూలులో న్యూరాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎ. శ్రీనివాసులు 2022 నవంబరు 8 నుంచి విధులకు దూరంగా ఉన్నారు. తిరుపతి ఎస్వీ వైద్య కళాశాలలో రేడియోథెరపీ అసోసియేట్ ప్రొఫెసర్ ఎన్. ఆర్ముగం 2022 నవంబరు 7 నుంచి గైర్హాజరవుతున్నారు. ఒంగోలులో పీడియాట్రిక్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం. మురళీకృష్ణ 2022 జూన్ 28 నుంచి రావడం లేదు. న్యూరో సర్జరీ అసిస్టెంట్ ప్రొఫెసర్ షేర్ ఖాన్ 2022 మార్చి 13 నుంచి, గైనకాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ సునయ కమల 2022 సెప్టెంబరు 30 నుంచి విధులకు హాజరు కావడం లేదు. అనంతపురంలో ఆర్థోపెడిక్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆర్. బాలాజీ 2022 సెప్టెంబరు 1 నుంచి, కడపలో రేడియో డయాగ్నసిస్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పి. అర్చనారెడ్డి 2022 ఆగస్టు 22 నుంచి విధులకు దూరంగా ఉన్నారు.

# చమురు ట్యాంకర్ల దిగ్బంధనం




**కారకాస్:** ఆంక్షల నడుమ వెనిజులాకు రాకపోకలు సాగిస్తున్న చమురు ట్యాంకర్లను పూర్తి స్థాయిలో దిగ్బంధించాలని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఆయన తన ట్రూత్ సోషల్ వేదికలో ఓ పోస్ట్ పెట్టారు. వెనిజులా అధ్యక్షుడు నికొలస్ మదురోపై ఆయన మరోసారి విషం చిమ్ముతూ దొంగిలించిన చమురు సంపదను ఉపయోగిస్తూ నేరాలు, ఉగ్రవాదం, మానవ అక్రమ రవాణాకు పాల్పడుతున్నారని ఆరోపించారు. 'వెనిజులాను యుద్ధ నౌకలు పూర్తిగా చుట్టుముట్టాయి. దక్షిణ అమెరికాలో మున్నెన్నడూ ఈ విధంగా మోహరింపు జరగలేదు' అని తెలిపారు. అమెరికా చమురును, భూమిని, ఇతర ఆస్తులను వెనిజులా తిరిగి ఇవ్వని పక్షంలో ఈ మోహరింపు మరింత పెరుగుతుందని హెచ్చరించారు. మదురో ప్రభుత్వాన్ని తాము ఒక 'విదేశీ ఉగ్రవాద సంస్థ'గా పరిగణిస్తున్నామని ట్రంప్ తెలిపారు. ఆ ప్రభుత్వం మాదక ద్రవ్యాలను రవాణా చేస్తోందని, కిడ్నాపులకు పాల్పడుతోందని, మనుషులను స్మగ్లింగ్ చేస్తోందని, హింసకు తెగబడుతోందని ఆరోపించారు. వెనిజులా క్షేత్రాల నుంచి దొంగిలిం చిన చమురుతో సంపాదించిన సొమ్మును మాదక ద్రవ్యాల ఉగ్రవాదానికి వినియోగిస్తోందని ధ్వజమెత్తారు. ఒక పద్ధతి ప్రకారం జరుగుతున్న దొంగతనాన్ని, నేరపూరిత కార్యకలా పాలను అమెరికా ఇంకెంత మాత్రం సహించబోదని చెప్పారు. ట్రంప్ జారీ చేసిన ఆదేశాల ప్రకారం ఆంక్షలను ఎదుర్కొంటూ వెనిజులాకు రాకపోకలు సాగిస్తున్న చమురు ట్యాంకర్లను అమెరికా దళాలు అడ్డుకుంటాయి. అయితే ఎన్ని దిగ్బంధనలు ఉంటాయి, మిత్ర దేశాలు కూడా ఇందులో భాగస్వాములవుతాయా అన్నది ఆయన వివరించలేదు. ట్రంప్ తన తాజా చర్యను ఇమ్మిగ్రేషన్‌తో ముడిపెట్టారు. బైడెన్ ప్రభుత్వ హయాంలో అమెరికాలో ప్రవేశించిన వెనిజులా ప్రజలను త్వరితగతిన తిప్పిపంపుతామని చెప్పారు. వెనిజులాను అమెరికా అష్టదిగ్బంధం చేస్తుంది. గగనతలం, సముద్రమార్గం వరకూ అన్ని వైపులా క్రమంగా నిర్బంధిస్తుంది.. ఈ నేపథ్యంలో ఆ ప్రాంతంలో యుద్ధ మేఘాలు కమ్ముకొస్తున్నాయి. అమెరికా సైన్యం ఇప్పటికే కరేబియన్‌లోనూ, వెనిజులా జలాల సమీపంలోనూ పెద్ద ఎత్తున మోహరించింది. ఆ ప్రాంతంలో ఉన్న యుద్ధ నౌకలు అదను కోసం వేచి చూస్తున్నాయి. మరోవైపు గగనతల నిఘా కూడా కొనసాగుతోంది. మాదక ద్రవ్యాలను రవాణా చేస్తున్నాయన్న కారణంతో అనేక ఓడలను ఇప్పటికే స్వాధీనం చేసుకున్నారు.




# నేడు టీమిండియా, దక్షిణాఫ్రికాల మధ్య ఐదో టీ20



అహ్మదాబాద్ వేదికగా శుక్రవారం దక్షిణాఫ్రికాతో ఐదో టీ20లో తలపడేందుకు భారత జట్టు సిద్ధమవుతోంది. ఈ మ్యాచ్‌లో గెలిచి సిరీస్‌ను 3-1 తేడాతో సొంతం చేసుకోవాలని టీమిండియా పట్టుదలతో ఉంది. మరోవైపు ప్రొటీస్ జట్టు కూడా ఈ మ్యాచ్‌లో ఆతిథ్య జట్టును ఓడించి సిరీస్‌ను సమం చేయాలని భావిస్తుంది. ఇది ఇలా ఉంటే చివరి మ్యాచ్ కోసం భారత్ జట్టులో పలు మార్పులు జరగనున్నాయి. నాలుగో టీ20కు ముందు ప్రాక్టీస్ చేస్తుండగా భారత వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ పాదానికి గాయమైంది. దీంతో చివరి రెండు టీ20లకు అతడు దూరంగా ఉండనున్నట్లు బీసీసీఐ ఓ ప్రకటనలో పేర్కొంది. గాయం కారణంగా గిల్ దూరంగా చివరి మ్యాచ్ కు దూరం కావడంతో స్టార్ వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్ తిరిగి తుది జట్టులోకి రానున్నాడు. అభిషేక్ శర్మతో కలిసి భారత ఇన్నింగ్స్‌ను సంజూ ప్రారంభించనున్నట్లు బీసీసీఐ వర్గాలు వెల్లడించాయి. ఈ సిరీస్‌లో ఇప్పటివరకు బెంచ్‌కే పరిమితమైన సంజూ.. 2026 టీ20 వరల్డ్ కప్ నేపథ్యంలో తన ఫామ్‌ను నిరూపించుకోవడానికి చివరి టీ20 మ్యాచ్ మంచి అవకాశం అని క్రీడా నిపుణులు చెబుతున్నారు. దీంతో సంజూ ఫ్యాన్స్ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గిల్ కోసం సంజూను బెంచ్ కే పరిమితం చేశారని, అయితే అనూహ్యంగా సంజూకు జట్టులో చోటు దక్కిందని నెటిజన్లు అభిప్రాయ పడుతున్నారు. మరోవైపు ఈ కీలక మ్యాచ్‌కు స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా అందుబాటుపై కూడా ఇంకా స్పష్టత లేదు. ఒకవేళ అతడు జట్టుతో కలవకపోతే హర్షిత్ రాణా ప్లేయింగ్ ఎలెవన్‌లో కొనసాగనున్నాడు. అదేవిధంగా ఆల్ రౌండర్ అక్షర్ పటేల్ స్థానంలో ప్రధాన జట్టులోకి వచ్చిన ఆల్‌రౌండర్ షాబాజ్ అహ్మద్‌కు ప్లేయింగ్ ఎలెవన్‌లో స్థానం లభించకపోవచ్చు.

**భారత తుది జట్టు (అంచనా):** సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), అభిషేక్ శర్మ, సంజూ శాంసన్, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే, వాషింగ్టన్ సుందర్, అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా, వరుణ్ చక్రవర్తి, కుల్దీప్ యాదవ్.

## పొగమంచు కారణంతో

# సాగని భారత్-దక్షిణాఫ్రికా నాలుగో టీ20



వర్షం కారణంగా మ్యాచ్‌లు రద్దు కావడం క్రికెట్ అభిమానులకు పరిచయమే. అయితే, మంచు కమ్మేయడంతో ఓ అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్ రద్దు కావడమనే అరుదైన ఘటన భారత్‌లో చోటు చేసుకొంది. ఇక్కడ దట్టమైన పొగమంచుతో భారత్, దక్షిణాఫ్రికాల మధ్య బుధవారం జరగాల్సిన నాలుగో టీ20 రద్దయింది. మ్యాచ్‌లో ఒక్క బంతి కూడా పడలేదు. మైదానాన్ని పూర్తిగా మంచు కమ్మేయడంతో ఎదురున ఉన్న వారు స్పష్టంగా కనిపించడమే గగనమైంది. దీంతో టాస్ కూడా వేయలేక పోయారు. రెండున్నర గంటలకు పైగా వేచిచూసిన అంపైర్లు ఈ మధ్యలో ఆరుసార్లు విజిబులిటీని పరిక్షించారు. ఇక, చివరగా రాత్రి 9.25 గంటలకు మరోసారి స్టేడియంలో కలియదిరిగారు. కానీ ఫలితం లేకపోవడంతో, మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. మ్యాచ్ జరిగే అవకాశాలు లేవని ముందుగానే అర్థం కావడంతో చాలామంది ప్రేక్షకులు నెమ్మదిగా మైదాన్ని వీడారు. రద్దు ప్రకటన వచ్చే సమయానికి కొద్ది మంది మాత్రమే స్టాండ్స్‌లో కనిపించారు. దక్షిణాఫ్రికాతో ఐదు మ్యాచ్‌ల సిరీసలో భారత్ 2-1తో ఆధిక్యంలో ఉంది. ఈ నేపథ్యం టీమిండియా సిరీస్ గెలుస్తుందా? లేక సౌతాఫ్రికా సమం చేస్తుందా? అనేది శుక్రవారం అహ్మదాబాద్‌లో జరిగే ఐదో, ఆఖరి టీ20లో తేలనుంది.

శీతాకాలంలో వాతావరణ పరిస్థితులను అంచనావేయకుండా బీసీసీఐ ఉత్తర భారతంలో మ్యాచ్‌లను షెడ్యూల్ చేయడం విమర్శలకు దారి తీసింది. లఖ్‌నవూ, న్యూ చండీగఢ్, ధర్మశాలలో ఈ రోజుల్లో చలి తీవ్రంగా ఉంటుంది. బుధవారం లఖ్‌నవూలో గాలి నాణ్యత కూడా ప్రమాదకర స్థాయికి పడిపోయింది. భారత జట్టు వామప్ చేసేటప్పుడు ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా మాస్క్ ధరించి కనిపించాడు. దీంతో ఆటగాళ్ల ఆరోగ్యం విషయంలో బోర్డుకు ఎంత శ్రద్ధ ఉందో ఇట్టే అర్థమవుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే, రొటేషన్ పాలసీని అనుసరిస్తున్న బీసీసీఐ ఈ వేదికలను ఖరారు చేసింది. కానీ, వాతావరణం గురించి ఏమాత్రం ఆలోచించలేదు. న్యూజిలాండ్‌తో జనవరి 11 నుంచి జరిగే వైట్‌బాల్ సిరీసలకు పశ్చిమ, దక్షిణ భారతంలోని వడోదర, రాజ్‌కోట్, ఇండోర్, నాగ్‌పూర్, విశాఖపట్నం, తిరువనంతపురాన్ని వేదికలుగా ఎంపిక చేశారు. కానీ, వీటిని ప్రస్తుతం దక్షిణాఫ్రికాతో మ్యాచ్‌లకు ఎంపిక చేస్తే తాజా సిరీస్ సజావుగా సాగేదన్న కామెంట్లు వినిపిస్తున్నాయి. రొటేషన్ పాలసీకి న్యాయం చేసినట్టు ఉండేదని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ధర్మశాలలోని తీవ్ర చలికి తాను ఎంతో ఇబ్బందిపడినట్టు స్పిన్నర్ వరణ్ చక్రవర్తి చెప్పాడు. ఈ నేపథ్యంలో బోర్డు ఆపరేషన్స్ టీమ్ పనితీరుపై కూడా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వాతావరణాన్ని గమనించి మ్యాచ్‌ను కొన్ని గంటల ముందు నిర్వహించేలా ప్లాన్-బిని సిద్ధం చేసి ఉంటే కొంతలో కొంత మెరుగ్గా ఉండేదని అభిప్రాయం వినవస్తోంది.




# ‘ది రాజాసాబ్’

## జనవరి 8న ప్రత్యేక ప్రీమియర్ షో



రెబల్ స్టార్ ప్రభాస్ పాన్‌ఇండియా మూవీ ‘రాజాసాబ్’ రిలీజ్‌కు టైమ్ దగ్గరపడుతోంది. 2026 జనవరి 09న ఈ సినిమా వరల్డ్‌వైడ్ గ్రాండ్‌గా రిలీజ్ కానుంది. ఈ క్రమంలో మేకర్స్ ప్రమోషన్స్‌లో జోరు పెంచేశారు. అందులో భాగంగానే తాజాగా రెండు అదిరే అప్డేట్లు షేర్ చేసుకున్నారు. ఈ సినిమా ప్రీమియర్లు, ప్రీ రిలీజ్ ఈవెంట్ గురించి అప్డేట్ ఇచ్చేశారు. థియేటర్ రిలీజ్‌కు ఒక రోజు ముందు అంటే జనవరి 08న రాజాసాబ్ ప్రీమియర్లు ఉండనున్నట్లు మేకర్స్ తాజాగా సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో పోస్ట్ షేర్ చేశారు. అలాగే ఈ సినిమా విడుదలకు ముందుగానే ప్రీ రిలీజ్ ఈవెంట్ కూడా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ ఈవెంట్‌కు హైదరాబాద్ వేదికగానే ఓపెన్ గ్రౌండ్స్‌లో ఉంటుందని తెలిపారు. చాలా రోజుల తర్వాత ప్రభాస్‌ను ఈ ఈవెంట్‌లో చూస్తారని ఫ్యాన్స్‌కు నిర్మాత విశ్వప్రసాద్ కిక్కిచ్చే న్యూస్ చెప్పారు. దీంతో రెబల్ ఫ్యాన్స్ ఫుల్ ఖుషీ అవుతున్నారు. అయితే ప్రీ రిలీజ్ ఈవెంట్ డేట్ మాత్రం మేకర్స్ వెల్లడించలేదు. అలాగే ఈ మూవీ నుంచి ‘సహనా సహనా’ అనే మెలోడి పాటను రిలీజ్ చేశారు. ఇందులో ప్రభాస్- నిధి అగర్వాల్ జోడీ ఆకట్టుకుంటోంది. సాంగ్ కూడా కలర్‌ఫుల్‌గా ఉంది. లిరిసిస్ట్ కృష్ణకాంత్ ఆ సాంగ్ రాశారు. సింగర్ విశాల్ మిశ్రా పాడారు. ఎస్ ఎస్ తమన్ సంగీత దర్శకుడు. ఇందులో ప్రభాస్ బ్లూ కలర్ జాకెట్ ధరించి ఉండగా, నిధి అగర్వాల్ ఎల్లో కలర్ ఔట్‌ఫిట్‌లో మెరిసి పోతుంది. ఈ పాట ఫుల్ వెర్షన్ అన్ని ప్లాట్‌ఫామ్స్‌లో అందుబాటులోకి వచ్చిందని ఓ పోస్టర్‌ను పోస్ట్ చేశారు.

# 19న ‘గుర్రం పాపిరెడ్డి’



నరేష్ అగస్త్య, ఫరియా అబ్దుల్లా ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం ‘గుర్రం పాపిరెడ్డి’. ‘డార్క్ కామెడీ’ అనే వైవిధ్యమైన జోనర్‌లో ఇది తెరకెక్కింది. ఈ నెల 19న విడుదల కానున్న నేపథ్యంలో, తాజాగా చిత్ర యూనిట్ ప్రీ-రిలీజ్ ప్రెస్ మీట్‌ను నిర్వహించింది. ఈ వేడుకలో బ్రహ్మానందం ముఖ్య అతిథిగా పాల్గొని చిత్ర విశేషాలను పంచుకున్నారు. ఈ చిత్రంలో ఆయన జడ్జి పాత్రలో కనిపిస్తున్నారు. ఆయన మాట్లాడు తూ, ‘ఈ సినిమా కథను ప్రేక్షకులకు వివరించే కీలక బాధ్యత తన పాత్రదేన’ని తెలిపారు. ‘దర్శకు డు మురళీ మనోహర్ ఈ తరం ప్రేక్షకులకు నచ్చేలా ఒక సరికొత్త కథాంశాన్ని ఎంచుకున్నారు. నరేష్ అగస్త్య, ఫరియా

అబ్దుల్లా తమ పాత్రల కోసం పడిన శ్రమ అద్భుతం. ముఖ్యంగా వారి ఓల్డ్ ఏజ్ గెటప్స్ చూసి నేను మొదట గుర్తుపట్టలేకపోయాను’ అని ప్రశంసించారు. తమిళ కమెడియన్ యోగి బాబు ఈ చిత్రంలో తనదైన శైలిలో నవ్వులు పూయిస్తారని, ఆయన పాత్ర సినిమాకు ప్రత్యేక ఆకర్షణ అని బ్రహ్మానందం పేర్కొన్నారు.

ఫరియా అబ్దుల్లా ఈ చిత్రంలో ‘సౌధామిని’ అనే పాత్రలో కనిపించ బోతున్నారు. ఆమె ఈ చిత్రంలో నటించడమే కాక, ఒక పాట రాసి, పాడి, కొరియోగ్రఫీ కూడా చేశారు. డా. సంధ్య గోలీ సమర్పణలో వేణు సద్ది, అమర్ బురా, జయకాంత్ (బాబీ) ఈ సినిమాని నిర్మించారు.






# సోషల్ మీడియాలో అసభ్య ప్రచారంపై నివేదా థామస్ సీరియస్



ప్రముఖ నటి నివేదా థామస్ తన ఫొటోలను కొందరు ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) టెక్నాలజీతో మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో అసభ్యకరంగా ప్రచారం చేయడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది చట్టవిరుద్ధమని, తన వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించడమేనని పేర్కొంటూ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ఓ ప్రకటన విడుదల చేశారు. బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటానని ఆమె హెచ్చరించారు. ఇటీవల నివేదా థామస్ క్రీమ్ కలర్ చీరలో ఉన్న ఒక అందమైన ఫొటోను తన సోషల్ మీడియా ఖాతాలో పోస్ట్ చేశారు. ఈ ఫొటో వైరల్ అవ్వగా, కొందరు ఆకతాయిలు దానిని ఏఐ సాయంతో అసభ్యకరంగా మార్చి ఆన్‌లైన్‌లో సర్క్యులేట్ చేయడం ప్రారంభించారు. ఈ విషయం ఆమె దృష్టికి రావడంతో తీవ్రంగా స్పందించారు. ఈ సందర్భంగా నివేదా తన ప్రకటనలో, “నా అనుమతి లేకుండా నా ఫొటోను ఏఐ సాయంతో మార్చి సర్క్యులేట్ చేస్తున్న విషయం నా దృష్టికి వచ్చింది. ఇది చాలా బాధాకరం. ఆమోదయోగ్యం కాదు, చట్టవిరుద్ధం కూడా. ఇది నా వ్యక్తిగత గోప్యతకు తీవ్ర భంగం కలిగించడమే” అని పేర్కొన్నారు. “ఈ విషయాన్ని నేను తీవ్రంగా పరిగణిస్తున్నాను. అజ్ఞాత ఖాతాల ద్వారా ఇలాంటివి చేస్తున్న వారు వెంటనే ఆ కంటెంట్‌ను తొలగించాలి. లేదంటే చట్టపరమైన చర్యలు తప్పవు. ఇటువంటి వాటిని ఎవరూ షేర్ చేయవద్దు, ప్రోత్సహించవద్దు” అని ఆమె విజ్ఞప్తి చేశారు. ‘జెంటిల్మన్’, ‘నిన్ను కోరి’, ‘జై లవకుశ’, ‘వకీల్ సాబ్’ వంటి విజయవంతమైన చిత్రాలతో నివేదా థామస్ తెలుగు ప్రేక్షకులకు సుపరిచితురాలు.

Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**